https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్ధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 276 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | శనివారం, ఆగస్టు,1, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

### విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు..!

## లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు



**న్యూయార్క్,జులై31:**
అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాస్యం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది.
హెచ్1–బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చేఎఫ్–1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆదేశ హోంశాఖ భావిస్తున్నట్లు దవాల్‌స్ట్రీట్‌జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల19వేల విదేశీవిద్యార్థులు ఓపీటీ స్కీమ్ కిందఅమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1–బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి.

## అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

### 450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ..

**న్యూయార్క్,జులై31:**
అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా'ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లుఒక్కసారిగా 9శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా,వియత్నాం,టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కా వడం విశేషం. ఈచరిత్రాత్మక ర్యాలీ వెనుకఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. ఈభారీ పెట్టుబడులు




నిజంగానే లాభాలనుతెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ–ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా..టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయే మోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది.

### ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

## మెటాపై సైబర్ క్రైమ్ పోలీసుల కేసు

**హైదరాబాద్,జులై31:**
భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఎఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈచర్యలు తీసుకున్నారు.సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు ఎఐ సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది.
ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతనభారతీయ న్యాయ సంహిత,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తు న్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరుసృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి,స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే పక్రియపై వివరణ కోరారు.

## 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాలో తస్లీమా..

### రాకతోనే రాజకీయ దుమారం..!

**కోల్‌కతా,జూలై,31:**
దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత వివాదాస్పద బంగ్లాదేశ్‌రచయిత్రి తస్లీమా నస్రీన్ మళ్లీ కోల్‌కతాలో అడుగుపెట్టారు. 2007లో తన 'ద్విఖండితో' ఆత్మకథపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో నగరాన్ని విడిచి వెళ్లాల్సి వచ్చిన ఆమె, నేడు కోల్‌కతాలోని నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ "ఇక్కడ నాకు చాలా సంతోషంగా ఉంది" అనిఆమె వ్యాఖ్యానించారు. ఒకప్పుడు బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చి కోల్‌కతానే తన నివాసంగా మార్చుకున్న తస్లీమాను, ఇక్కడి నుంచి వెళ్లగొట్టిన వివాదం తెలిసిందే. ఆమె రాసిన 'ద్విఖండితో' పుస్తకం మతపరమైన మనోభావాలను దెబ్బతీస్తోందనే ఆరోపణలతో అప్పటి సీపీఎం ప్రభుత్వం 2003లో నిషేధించింది. ఆతర్వాత 2007లో తీవ్ర నిరసనల కారణంగా ఆమె నగరాన్ని వీడారు. ప్రస్తుతం 63ఏళ్ల తస్లీమా ఢిల్లీలో దీర్ఘకాలిక నివాస అనుమతితో ఉంటున్నారు. రేపు ఆమె రవీంద్ర సదన్‌లో మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, ప్రముఖ రచయిత శిర్షెందు ముఖోపాధ్యాయ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఆమె తన కవితలను వినిపించడంతో పాటు ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. తన రాకపై పీటీఐతో మాట్లాడుతూ..
"నేను కోల్‌కతాను ఎప్పుడూ ఇష్టపూర్వకంగా విడిచిపెట్టలేదు. అప్పటి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నన్ను బలవంతంగా రాష్ట్రం విడిచి వెళ్లేలా చేసింది. అయినా ఏదో ఒక రోజు తిరిగి వస్తానని ఆశతోనే ఉన్నాను. ఏళ్లు గడిచాయి, ప్రభుత్వాలు మారాయి, అయినా నాకు తలుపులు మూసే ఉన్నాయి" అని ఆమె తన ఆవేదన వ్యక్తం చేశారు.

**రాజకీయ దుమారం**
తస్లీమా నస్రీన్ రాక పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మాటల యుద్ధానికి దారితీసింది. తృణమూల్ ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ స్పందిస్తూ, ఆమె తరచూ ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడటం వల్లే 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఆమెకు స్వాగతం పలుకుతోందని ఆరోపించారు.
మరోవైపు బెంగాల్ మంత్రి అగ్నిమిత్రా పాల్ ఆమె రాకను గట్టిగా సమర్థించారు. "గత ప్రభుత్వాల హయాంలో ఆమెకు తిరిగి వచ్చే అవకాశం ఇవ్వలేదు. లౌకికవాదం గురించి మాట్లాడే ప్రతిపక్షాలు, ఆమె తన పుస్తకంలో నిజం రాసినప్పుడు భద్రత కల్పించలేకపోయాయి.

### నర్సంపేటకు చేరుకున్న


## పెద్ది భౌతిక కాయం

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు
### అభిమన నేతకు నివాళి కోసం భారీగా తరలివచ్చిన జనం
### రెండు కిలోమేటర్ల మేర ట్రాఫిక్ జామ్



**వరంగల్,జూలై31:**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక కాయం నర్సంపేటకు చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసి పలువురు భావోద్వేగానికి గురయ్యారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న పెద్దిసుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటల తర్వాత తుదిశ్వాస విడిచారు. జూలై 26వ తేదీన ఉదయం హనుమకొండలోని తన నివాసంతో పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో తొలుత స్థానిక ఆస్పత్రికి, ఆతర్వాత సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఆయన్ను కాపాడలేకపోయారు.తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. వరంగల్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సాధనకు అండగా నిలిచిన ఆదర్శ నాయకుడైన సుదర్శన్ రెడ్డి, 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. ఆయన 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బీఆర్ఎస్) తరఫున జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్పీటీసీ) సభ్యుడిగా ఎన్నికయ్యారు.
ఆయన 2004లో టీఆర్ఎస్ జిల్లా పార్టీ కన్వీనర్‌గా ఎన్నికై, ఆతర్వాత 2002లో రాష్ట్రపార్టీ కన్వీనర్‌గా నామినేట్ అయ్యారు. ఆయన ఎనిమిదేళ్లకు పైగా టీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, ఆతర్వాత పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నామినేట్ అయ్యారు. తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీఎమ్మెల్యేపెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా,పెద్దా తేడా లేకుండా అన్నివర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరివీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది.

## భద్రాద్రి వద్ద గోదావరి ఉగ్రరూపం





### కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి
### భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు

**కాళేశ్వరం,భద్రాద్రి కొత్తగూడెం,జూలై31:**
భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం భద్రాచలం వల్ల గోదావరి నీటి మట్టం 44 అడుగులకు చేరింది. 9,74,666 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో రాబోయే గంటల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార వర్గాలు సూచించాయి. గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ,విపత్తు నిర్వహణ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఎవరూ కూడా గోదావరి వైపుకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.
ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కాళేశ్వరం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం 9:00గంటలకు సీడబ్ల్యూసీ కాళేశ్వరం స్టేషన్ వద్దగోదావరి నీటిమట్టం 11.50 మీటర్లకు చేరింది. ప్రస్తుతం ప్రాం తంలో వాతావరణం మేఘావృతంగా ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 96.40 మీటర్లు నమోదైంది. వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు 85 గేట్లను పూర్తిగా ఎత్తిఉంచారు. ప్రస్తుతం గోదావరి నది బ్యారేజ్ వద్ద పరిస్థితిలో ప్రవహిస్తోంది. కాళేశ్వరం వద్ద హెచ్చరికస్థాయి 12.210 మీటర్లు, ప్రమాదస్థాయి 13.460 మీటర్లుగా ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

### రేషన్ కార్డుదారులకు ఊరట..

## ఈ–కేవైసీ గడువు పెంపు

### రేషన్ ఈ–కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు

**రాష్ట్రవ్యాప్తంగా కొత్త గడువు అమలు**
**భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం**
**ఈ-కేవైసీ లేకున్నా మూడు నెలల రేషన్ పంపిణీ**
**శనివారం నుంచి ఒకేసారి సరకుల పంపిణీ**
**సమీప రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం**



రేషన్ కార్డుదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ–కేవైసీ పూర్తి చేసుకునేందుకు ఇచ్చిన గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఇప్పటివరకు ఈ–కేవైసీ పూర్తి చేయలేకపోయిన వారికి ఇది పెద్ద ఊరటగా మారింది. మొదట ఈ వెసులుబాటును జీహెచ్ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఇతర జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'స్మార్ట్' ప్రక్రియ, పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే గడువు పెంచినట్లు అధికారులు తెలిపారు.
మరోవైపు రేషన్ కార్డుదారులకు మరో శుభవార్త కూడా ఉంది. ఈ–కేవైసీ పూర్తయిందా లేదా అన్న దానితో సంబంధం లేకుండా శనివారం నుంచి మూడు నెలల బియ్యం, ఇతర రేషన్ సరకులను ఒకేసారి పంపిణీ చేయనున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంకా ఈ–కేవైసీ పూర్తి చేయని వారు ఆగస్టు 31లోపు సమీప రేషన్ దుకాణంలో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమా

**-రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్గం యశ్పాల్ గౌడ్- ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి- విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి- పారంద సాయి,బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అర్బన్ నాయకులు.**

ఎల్బీనగర్, జూలై 31( డీకే చాటింపు) బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అర్బన్ నాయకులు పారంద సాయి మరయు జయ తేజ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్,హయత్ నగర్ పరిధిలోని పలు ప్రైవేట్ జూనియర్,డిగ్రీ మరయు బీటెక్ కళాశాలల్లో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్గం యశ్పాల్ గౌడ్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యశ్పాల్ గౌడ్ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాలుగా విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను గత బి ఆర్ యస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా సుమారు రూ.15 వేల కోట్ల మేర బకాయిలను 40 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచాయని విమర్శించారు. ఈ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకు పైగా విద్యార్థులు, వారి పేద మరియు మధ్య తరగతి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా, వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని,



లేకపోతే బీజేపీ మరయు బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాదీజ మోర్చ జిల్లా నాయకులు నక్క రాజేష్ గౌడ్, ప్రమోద్ రెడ్డి,బీజేవైఎం హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ నాయకులు ఎర్ర ప్రేమ,పాండాల అభిలాష్ గౌడ్,విష్ణు చారి,బుల్లెట్ సాయి యాదవ్,చరణ్ మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా కనిపిస్తున్న జలాశయాలు

**హైదరాబాద్:** ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయ్యాయి. కానీ, ప్రధాన నదులపై ఉన్న జలాశయాలకు ఇప్పటివరకు నీటి ప్రవాహం రాలేదు. శ్రీశైలం జలాశయానికి కేవలం 5.9 టీఎంసీల నీరు మాత్రమే చేరింది, అది కూడా స్థానిక వర్షాల వల్ల. సాధారణంగా జూన్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పటికీ, జులైలో కనీసం 200 టీఎంసీల వరద వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితులు మారాయి. గత 25 సంవత్సరాలలో, ఖరీఫ్‌లో జూన్ మరియు జులైలో శ్రీశైలానికి 10 టీఎంసీల కంటే తక్కువ నీటి ప్రవాహం వచ్చిన సంవత్సరాలు 6 ఉన్నాయి. ఈ ఏడాది కూడా అలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఇది రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది.కర్ణాటకలోని ఆల్మట్టిలో ప్రస్తుతం 47 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది, కానీ ఆల్మట్టికి నిండటానికి ఇంకా 28 టీఎంసీల నీరు అవసరం. నారాయణపూర్‌కు 12 టీఎంసీల నీరు కావాలి. జులైలో ఆల్మట్టిలో పూర్తి స్థాయి నీటి నిల్వ జరగకూడదు. అయితే, ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చిన నీటిని నిల్వ చేస్తున్నారు, దీనిని హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి కోసం మరియు కాలువల కింద సాగుకు ఉపయోగిస్తున్నారు. ఈ నెలలో జూరాలకు నీటిని విడుదల చేయడం కష్టమవుతుంది, ఎందుకంటే ప్రవాహం పెరగకపోతే, నాగార్జునసాగర్ మరియు శ్రీశైలం జలాశయాలపై ప్రభావం ఉంటుంది.గోదావరి నదిలో కూడా పరిస్థితి అంతే. ప్రాణహిత నదిలో కూడా ఈ ఏడాది తక్కువ వరద ఉంది.



మేడిగడ్డ వద్ద 16,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది, ఇది మంగళవారం 16,620 క్యూసెక్కులుగా ఉంది. రాష్ట్రానికి గోదావరి నదిపై ఎగువన ఉన్న శ్రీరామసాగర్‌కు 2,199 క్యూసెక్కుల నీరు వస్తోంది. కానీ దిగువన ఎల్లంపల్లిలోకి కేవలం 963 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, వ్యవసాయ శాఖ అత్యవసర ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జిల్లాలవారీగా సాగుకు అనువైన పంటల గురించి సమాచారాన్ని అందించనుంది.

# కుమారస్వామి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే గడ్డం వినోద్...



బెల్లంపల్లి (డీకే చాటింపు ) పట్టణంలోని హనుమాన్ బస్తీ కి చేందిన సింగరేణి సెక్యూరిటీ గార్డ్ కేశబోయిన కుమారస్వామి ఇటీవల గుండె పోటు తో మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్, కుమారస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు సింగరేణి అధికారుల ఒత్తిడి తోనే కుమారస్వామి ఆందోళన చెంది గుండెపోటు కు గురయ్యాడని వాపోయారు. కుమారస్వామి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు గెల్లి రాయలింగు, పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, నాయకులు బండి రాము, తదితరులు పాల్గొన్నారు

# ఫస్ట్...లాస్ట్... తెలంగాణనే..!




**హైదరాబాద్ :** కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (ఖఉఐ) 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట-3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. తరగతి గదిలో బోధన, విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలు ఇంకా తీవ్ర ఆందోళనకరంగానే ఉన్నాయని ఈ అంకెలు తేటతెల్లం చేస్తున్నాయి.మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కూడా విద్యాశాఖను వేధిస్తోంది.ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో కేటాయించిన 190 మార్కులకు 91.9 మార్కులు సాధించి రాష్ట్రం 20వ స్థానంలో నిలిచింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన శౌచాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేవలం ఓవరాల్ ర్యాంకింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్యనందించడంతో పాటు టీచర్ల శిక్షణ, మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

# సొంత పార్టీపై విమర్శలు

**హైదరాబాద్:** బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు.

# నిరుద్యోగ భరోసా యాప్ ప్రారంబోత్సవం

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి: నేడు దేశంలోని యువత పిడికిలి బిగించి ఈ నియంతృత్వ ప్రభుత్వాలు పోవాలి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు రావాలి అనే నినాదంతో ముందుకు పోతున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. హన్మకొండలో బుధవారం రాష్ట్ర వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపయోగకరంగా విన్నర్స్ ఆన్లైన్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన నిరుద్యోగ భరోసా ఆన్లైన్ కోచింగ్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ...ఈరోజు మన యువతరం భారతదేశం యొక్క సంపద, దేశానికి ఉండేటువంటి ఔన్నత్యంతో మన దేశ యువతరం ఈరోజు ప్రపంచంలో నలుమూలల ఎక్కడికి పోయినా మన వాళ్ళు కనబడతా ఉంటారు.దానికీ కారణం మన వాళ్ళు ఎన్నో దేశాలల్లో అన్ని రంగాలలో మన దేశ ప్రజలు నెంబర్ వన్ గా ఉన్నారు. మనదేశంలో మన రాష్ట్రంలో కూడా ఈనాటి యువతరానికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భ్రమలు కల్పించిన ప్రభుత్వాలు, వారికి ప్రజలు అవకాశాన్ని ఇచ్చిన తరువాత వాటిని గాలికి వదిలేసి ఈరోజు ఒక నియంతృత్వ పరిపాలనను ఈ రాష్ట్రంలో కొనసాగిస్తున్నట్టువంటి ఈ ముఖ్యమంత్రి, ఈరోజు నిరుద్యోగులు మాట్లాడితే ఆంక్షలు, రైతుల మాట్లాడితే ఆంక్షలు,ఉద్యోగులు మాట్లాడితే దాడులు ఇవన్నీ కూడా ఈ రాష్ట్రంలో పరిపాటిగా సాగుతున్నాయి.ఈరోజు భారతదేశంలో ఉన్నటువంటి ప్రధానమంత్రి గారు కూడా నిరుద్యోగ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం ఇది మా యొక్క మాట అని చెప్పడం జరిగింది. పన్నెండు సంవత్సరాలు పూర్తి అయింది, ఇప్పటి వరకు అక్కడ కూడా ఎటువంటి పురోగతి లేదు.నేడు ఢిల్లీ నగర వీధుల్లో నీట్ పరీక్ష లికేజిని యువతరం ప్రశ్నించి ఒక్క నిరసన కార్యక్రమం చేస్తే వారిని పిలిచి మాట్లాడి,ఆ సమస్యను సానుకూలంగా పరిష్కారం చేయాల్సింది పోయి ప్రభుత్వం యొక్క నియంతృత్వ ధోరణిని కేంద్రం



ప్రభుత్వం అవలభించడం ద్వారా నేడు దేశంలోని యువతరం అంతా పిడికిలి బిగించి ఈ ప్రభుత్వాలు పోవాలి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు రావాలి అనే ఒక్క నినాదంతో ముందుకు వెళుతున్నారు.కాబట్టి ముఖ్యంగా మన దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో హైదరాబాద్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతని కలిసి వారికీ ఒక్క భరోసా కల్పించే ప్రయత్నం చేసిందు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 31 నెలలు అవుతున్న రాహుల్ గాంధీ గారికి మన రాష్ట్ర యువత పడుతున్న కష్టం వారికీ కనపడటం లేదు. నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా ప్రజలను మోసం చేసింది కాబట్టి ఈ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈరోజు మన రాష్ట్రాన్ని సాధించిన పార్టీ,పది సంవత్సరాలు మన రాష్ట్రాన్ని పరిపాలన చేసిన పార్టీ, నిరుద్యోగులకు ఒక్క విశ్వాసాన్ని కల్పించి ప్రభుత్వ రంగంలోనే కాక, ప్రయివేట్ రంగంలోను అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన బిఆర్ఎస్ పార్టీ నేడు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. అందులో భాగంగానే రాష్ట్రంలో ఏ రంగంలోనైనా, ఎక్కడ అన్యాయం జరిగిన, అది ఏ వర్గానికి జరిగిన అక్కడ బిఆర్ఎస్ పార్టీ వారికీ అండగా ఉండి,వారికీ న్యాయం జరిగే వరకు పోరాడుతుంది అని తెలిపారు. ఈ సందర్భంగా యువత చేడు అలవాట్లకు దూరంగా ఉంటూ,సమాజంలో మంచి పేరుతో చరిత్రలో మనకి అంటూ ఒక్క పేజీ లిక్కించుకునే విదంగా బ్రతకాలని కోరారు

# అవినీతి అనకొండే..?

హైదరాబాద్: హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు



ఆభరణాలతోపాటు.. రూ.52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ.. గతంలో కూడా 2019లో లంచం కేసులో ఏసీబీకి చిక్కిన విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ.. ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# భూసేకరణ పనులువేగవంతంగా చేపట్టాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ : జిల్లాలో చేపట్టిన కీలక సాగునీటి, రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని స్పష్టం చేశారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ విభాగం,నేషనల్ హైవేస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.సమీక్షలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత మేర భూసేకరణ పూర్తయింది, ఎంత పెండింగ్‌లో ఉంది, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్?జగిత్యాల ఫోర్‌లేన్ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పురోగతిపై ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత సేకరించారు.ఇంకా ఎంత మిగిలి ఉంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని వివరాలు తెలుసుకున్నారు. అలాగే కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జిల ఆర్‌ఓబీలు నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాజెక్టుల ప్రభావిత రైతులకు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తికాని ప్రాంతాల్లో వెంటనే సర్వే చేపట్టి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు చేసి వివాదాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం, ఆగస్టు,1, 2026

# అరేబియా తీరాన ఆధ్యాత్మిక అజేయ దీప్తి...

అరేబియా సముద్ర అలలతో నిత్యం మ్రోగిపోతూ, భారతీయ ఆధ్యాత్మిక చైతన్యానికి శాశ్వత చిహ్నంగా నిలిచిన గుజరాత్ రాష్ట్రంలోని ప్రభాస్ పటణం సోమనాథ్ క్షేత్రం దేశ చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఆద్య జ్యోతిర్లింగంగా పూజలందుకుంటున్న సోమనాథ్ ఆలయం కేవలం భక్తి క్షేత్రం మాత్రమే కాదు; అది భారతీయుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి, నాగరికత సహనశక్తికి ప్రతీక. ఎన్నో విదేశీ దండయాత్రలు, దోపిడీలు, విధ్వంసాలు ఎదురైనా తిరిగి తిరిగి లేచి నిలబడిన ఈ దేవాలయం భారతదేశ చరిత్రలో "అజేయ ఆధ్యాత్మిక శక్తి"గా గుర్తింపు పొందింది. స్వాతంత్ర్యానంతరం ఈ ఆలయ పునర్నిర్మాణాన్ని దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించడం, ఇప్పుడు 75 సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఆలయాన్ని సందర్శించడం మరోసారి సోమనాథ్‌ను జాతీయ చర్చాంశంగా మార్చింది. సోమనాథ్ ఆలయ చరిత్ర పురాణ కాలం నుంచి ప్రారంభమవుతుంది. చంద్రుడు తన అత్తమామ అయిన దక్ష ప్రజాపతి శాపంతో కాంతిని కోల్పోయినప్పుడు ఈ క్షేత్రంలో పరమశివుని ఆరాధించి శాప విమోచనం పొందాడని శివ పురాణం, స్కాంద పురాణం, భాగవతం వంటి గ్రంథాలు వివరిస్తున్నాయి. "సోముడు" అంటే చంద్రుడు, "నాథుడు" అంటే పరమేశ్వరుడు. అందుకే ఈ క్షేత్రానికి "సోమనాథ్" అనే పేరు వచ్చింది. హిందూ సంప్రదాయంలో ఈ క్షేత్రానికి అత్యంత పవిత్ర స్థానం ఉంది. చరిత్రకారుల అంచనాల ప్రకారం సోమనాథ్ ఆలయం తొలి నిర్మాణం ప్రాచీన భారత కాలానికే చెందుతుంది. అనంతరం మౌర్యులు, చాళుక్యులు, ప్రతిహారులు, సోలంకీ రాజులు ఆలయాన్ని విస్తరించి మహత్తర శిల్పకళా సంపదగా తీర్చిదిద్దారు. సోమనాథ్ ఆలయం చరిత్రను పరిశీలిస్తే అది విదేశీ దండయాత్రలకు ప్రతిఘటించిన భారతీయ ఆత్మగౌరవ చరిత్రగా కనిపిస్తుంది. క్రీస్తు శకం 1025లో గజనీ మహ్మద్ భారీ సైన్యంతో సోమనాథ్‌పై దాడి చేసి ఆలయాన్ని ధ్వంసం చేశాడు. చరిత్రకారుల వివరాల ప్రకారం ఆలయంలో అపారమైన బంగారం, వెండి, రత్నాలు, వజ్రాలు నిల్వ ఉండేవి. గజనీ దాదాపు వేలాది ఒంటెలపై సంపదను తరలించాడని పాత వృత్తాంతాలు పేర్కొంటాయి. అయితే ఆలయం పూర్తిగా నశించలేదు. కొద్ది కాలానికే భక్తులు, స్థానిక రాజులు మళ్లీ పునర్నిర్మాణం చేపట్టారు. తర్వాత అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాధిపతులు, మొఘల్ దండయాత్రలు, చివరకు ఔరంగజేబు కాలంలో కూడా ఆలయం విధ్వంసానికి గురైంది. అయినప్పటికీ ప్రతి సారి సోమనాథ్ తిరిగి నిలిచింది. ఇదే ఈ క్షేత్ర విశిష్టత. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో సోమనాథ్ పునర్నిర్మాణం ఒక మహత్తర ఘట్టంగా నిలిచింది. దేశ సమైక్యతకు శిల్పిగా పేరుపొందిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ 1947లో జూనాగఢ్ సంస్థానం భారతదేశంలో విలీనం అయిన తర్వాత సోమనాథ్‌ను సందర్శించారు. అప్పటికి ఆలయం శిథిలావస్థలో ఉండేది. ఆ దృశ్యాన్ని చూసిన పటేల్ "సోమనాథ్ పునర్నిర్మాణం భారత జాతీయ ఆత్మగౌరవానికి ప్రతీక కావాలి" అని ప్రకటించారు. ప్రభుత్వ నిధులతో కాకుండా ప్రజల విరాళాలతో ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కేంద్ర మంత్రి కేఎం మున్షీ ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. జామ్‌నగర్ మహారాజా దిగ్విజయ్ సింగ్ తదితరులు కూడా ఆర్థిక, పరిపాలనా సహకారం అందించారు. 1951 మే 11న సోమనాథ్ ఆలయంలో జ్యోతిర్లింగ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ స్వయంగా హాజరై ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంఘటన స్వాతంత్ర్యానంతర భారతదేశంలో అత్యంత చారిత్రక పరిణామంగా నిలిచింది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చరిత్రకారులు పేర్కొంటారు. లౌకికవాద దేశంలో రాష్ట్రపతి ఒక మతపరమైన కార్యక్రమంలో పాల్గొనడం సరికాదని ఆయన భావించినట్లు చెప్పబడింది. అయినప్పటికీ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. "సోమనాథ్ పునర్నిర్మాణం కేవలం దేవాలయ నిర్మాణం కాదు; విదేశీ దండయాత్రలతో దెబ్బతిన్న భారతీయ ఆత్మవిశ్వాస పునరుద్ధరణ" అని ఆయన చారిత్రక ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పటి భారతీయ సమాజంలో గొప్ప చైతన్యాన్ని కలిగించాయి. ప్రస్తుతం ఉన్న సోమనాథ్ ఆలయం చాళుక్య శైలిలో అద్భుతంగా నిర్మించబడింది. ఆలయ శిఖరం సుమారు 155 అడుగుల ఎత్తులో నిలిచి దూరం నుంచే భక్తులను ఆకర్షిస్తుంది. శిఖరంపై ప్రతిష్ఠించిన కలశం బంగారు తేజస్సుతో మెరిసిపోతుంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సార్థ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

# సీపీఎస్ రద్దు చేసి.. పాత పెన్షన్(ఓపిఎస్) పునరుద్ధరించాలి

## -ఆగస్టు 31లోపు సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం... -పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి... -నర్వ మండలంలో ముమ్మరంగా సాగిన ఉపాధ్యాయ సభ్యత్వ నమోదు...





నారాయణపేట,(డీకే చాటింపు): సీపీఎస్ రద్దు చేసి..పాత పెన్షన్(ఓపిఎస్) పునరుద్ధరించాలని పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పిఆర్టియు టిఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని నర్వ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయుల అతి ప్రధాన సమస్య అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సిపిఎస్)తక్షణమే రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని(ఓపిఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సామాజిక భద్రతతతో ముడిపడి ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనితో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న6 డియర్నెస్ అలవెన్స్(డిఎ)లను వెంటనే విడుదల చేయాలని,కొత్త పీఆర్సీని కాలయాపన చేయకుండా అమలు చేయాలని కోరారు. ఆగస్టు నెల 31లోపు ఈ ప్రధాన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి, నర్వ మండల పిఆర్టియు



అధ్యక్షుడు సూరం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జి.హరీష్, గౌరవ అధ్యక్షుడు రాఘవ రెడ్డి,అసోసియేట్ అధ్యక్షుడు మల్లేష్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి,సదన్ రావ్,వెంకటేశ్వర్లు, నర్వ మండల ఎంఈఓ జి. రామ్ రెడ్డి,పెద్ద కడుమూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి,నర్వ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సునీత,పాతర్ చేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య,కేజీబీవీ ఎస్.ఓ శిరీష,జిల్లా నాయకులు వేణుగోపాల్ రెడ్డి,ఉస్మాన్, మధుసూదన్,నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భక్తుల దాహార్తిని తీర్చిన నారాయణపేట లయన్స్ క్లబ్

## -దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవాలయం దగ్గర నూతన బోరు ఏర్పాటు... రూ.లక్ష వ్యయంతో బోరు, మోటారు ప్రారంభించిన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, నారాయణపేట అధ్యక్షులు...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద భక్తులకు తాగునీటి ఇబ్బందులు ఉండటంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట ఆధ్వర్యంలో రూ.లక్ష వ్యయంతో బోరు తవ్వించి,మోటారు ఏర్పాటు చేశారు. ఈ బోరు మోటారును శుక్రవారం లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ బట్టాడ్,లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ కొనసాగిస్తుందని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులకు ఆలయ కమిటీ తరపున వారికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు లయన్స్ క్లబ్ యొక్క సేవలను ప్రశంసించారు. అడిగిన వెంటనే



దేవాలయం దగ్గర బోరు వేసి ఆ తర్వాత బోరు మోటర్ బిగించడం జరిగిందని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,దేవాలయ కమిటీ సభ్యులు,లయన్స్ క్లబ్ సభ్యులు బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న హమాలీకి లయన్స్ క్లబ్ అండ

## -మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు...







నారాయణపేట,(డీకే చాటింపు): ఆపదలో ఉన్న ఓ వ్యక్తికి అప్పన్న అస్తమందించి అందరి చేత ప్రశంసలు పొందారు లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవి కుమార్ గౌడ్..!అనారోగ్యంతో ఉన్న ఆ వ్యక్తికి స్థానికంగా వైద్య సేవలను అందించి ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు..!

వివరాల్లోకి వెళితే... నారాయణపేట పట్టణానికి చెందిన హమాలీ కార్మికుడు సాయిలు(50)గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఒంటరిగా ఉంటూన్నాడు. శుక్రవారం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ వెంటనే స్పందించారు. స్థానికుల సహాయంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించడంతో సాయిలు కుటుంబ సభ్యుల కోరిక మేరకు లయన్స్ క్లబ్ కు చెందిన ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఉచితంగా హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలవడం నిజమైన మానవత్వమన్నారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆపద ఉన్న వారికి మా వంతు సహాయాన్ని అందిస్తామని రవికుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షుని పలువురు అభినందించారు.

# అవినాష్ కాలేజ్ లో జల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ పై జర్నల్ క్

## డాక్టర్ టి సురేందర్ ఫౌండర్ చైర్మన్ సేవ్ ఎర్త్ ఫౌండేషన్






ఎల్బీనగర్, జులై31, డీకే చాటింపు:-అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, సమాజ సేవ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్పెషల్ స్పోక్స్ పర్సన్ అనుభవజ్ఞులు డాక్టర్ టి సురేందర్ విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. జల సంరక్షణ కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ కోసం సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. గ్రూప్ యాక్టివిటీస్ నిర్వహించడం జరిగింది. అనంతరం సురేందర్ కు కాలేజ్ ప్రిన్సిపాల్ నీతు సచ్ దేవ, హెచ్ఓడి ప్రసూన్ రెడ్డి, లెక్చరర్ నాగరాజు మొక్కను బహూకరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాము అన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానించిన కౌన్సిలర్ అసాధి మధు....



బెల్లంపల్లి(డీకే చాటింపు ) పట్టణంలో 14వ వార్డు లో అభివృద్ధిలో ఎండనక వాననక ఆరోగ్యని సైతం పణంగా ప్రాణాన్ని పెట్టి అహర్నిశకలు పారిశుద్ధముకై కష్టిస్తున్న బెల్లంపల్లి పురపాల సిబ్బంది ఆరోకొండ రాజమల్లు భారీ వర్షం కురుస్తున్నా భయపడకుండా ఉదయం నుండి డ్రైనేజీలు వాగుల వంకలు శుభ్రం చేస్తూ,వర్షానికి తడుస్తూ తన సహాయ సహకారాలు అందించిన రాజమల్లును వార్డు కౌన్సిలర్ అసాది మధు ఘనంగా శాలువాతో సన్మానించి, పారితోషికం అందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బిఆర్ఎస్ నాయకులు బెడ్డల మహేందర్, మమ్మద్ ఇమ్రాన్, తాజుద్దీన్, పాల్గొన్నారు

# సర్పంచుల మండల ఫోరమ్ అధ్యక్షునికి ఘన సన్మానం...



బెల్లంపల్లి (డీకే చాటింపు )ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఫోరమ్ ఎన్నికల్లో గెలిచినబెల్లంపల్లి మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు జాడి మహేశ్వర్ ని కార్యదర్శి సుధమళ్ళ వెంకటి, కోశాధికారి జుమ్మిడి లలిత బాణయ్య ను,బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, మరియు కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా మండలంలోని సర్పంచ్ సభ్యుల సమస్యలు వారి దృష్టికి తీసుకురావాలని జాడి మహేష్ కి వారు సూచించారు. తదనంతరం మండల ఫోరమ్ అధ్యక్షులు జాడి మహేష్ కి గడ్డం వినోద్, డిసిసి అధ్యక్షులు రఘునాథ్ మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ సభ్యులు పాల్గొన్నారు.

# కృంగిపోయి ,ప్రమాద కరంగా ఉన్న వరద కాలువ మ్యాన్‌హోల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి: బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి..



ఎల్బీనగర్, జూలై 31 (డి.కె చాటింపు) గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కృంగిపోయిన మ్యాన్‌హోల్స్‌ను తక్షణమే పునరుద్ధరించి, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బదం ప్రేమ్ మహేశ్వర రెడ్డి గారు ఈ రోజు గౌతం నగర్, పటేల్ నగర్ కాలనీ లో కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పర్యటించి, వెంటనే అధికారులతో ఫోన్ లో మాట్లాడి, ఎఈ సాయి మరియు వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ అక్కడికి పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాన్ హోల్ పాడై నెల రోజులు కావస్తున్నా ఇంకా పునరుద్ధరణ పనులు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం డివిజన్‌లో పలుచోట్ల మ్యాన్‌హోల్స్ కృంగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. వరద కాలువ పనులకు సంబంధించిన పెండింగ్ పనులు కూడా అధికారులు ఎ మాత్రం అలసత్వం లేకుండా ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌతం నగర్ కాలనీ వాసులు బాలకృష్ణ గౌడ్, శారదా, ప్రవీణ్, గండి జగన్ యాదవ్, వెంకటేశం,రవి , ఎంఎంసీ గడ్డి అన్నారమ్ ఎ ఈ సాయి , వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్

# సాగర్ రింగ్ రోడ్ చౌరస్తా నుంచి బి.ఎన్.రెడ్డి వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు : సుజాత నాయక్

ఎల్బీనగర్, జులై 31 (డికె చాటింపు) సాగర్ రింగ్ రోడ్డు నుంచి హస్తినా పురం మీదుగా బి.ఎన్.రెడ్డి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం కోసం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ సహకారంతో సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లినట్లు హస్తినాపురం మాజీ కార్పొరేటర్ సుజాత నాయక్ పేర్కొన్నారు. సాగర్ రింగ్ రోడ్డు నుంచి బి.యన్.రెడ్డి వరకు ప్రతిరోజు వేలాది వాహనాలు ప్రయాణిస్తుం డటంతో రోజు ట్రాఫిక్ జామ్ లు ఏర్పడుతున్నాయన్నారు. ఉదయం సాయంత్రం వేళ పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్ లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రోజురోజుకు కాలనీలు పెరుగుతూ సాగర్ రోడ్డుపై వాహనాల రద్దీ పెరుగుతూ మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. భవిష్యత్తులో మరింత ట్రాఫిక్ జామ్ లతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ట్రాఫిక్ రద్దీకి పరిష్కారంగా ఫ్లై ఓవర్ ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి కి కోరినట్లు తెలిపారు. నిధులు మంజూరై సాగర్ రింగ్ రోడ్డు చౌరస్తా నుంచి బి.యన్.రెడ్డి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుందని సుజాత నాయక్ పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి అయితే ప్రజలకు ట్రాఫిక్ రద్దీ సమస్య తీరుతుందని పేర్కొన్నారు.



# మాదిగల రాజ్యాధికార సముపార్జనే ఏకైక ఎజెండా మహోద్యమంగా దూసుకువెళుతున్న మాదిగ మహాశక్తి

- అన్ని రాజకీయ పార్టీలలోనూ మాదిగలకు అన్యాయమే
- లక్ష్యసాధనకు అందరు కలిసి రావాలి- మాదిగలకు మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపు



**హైదరాబాద్;** రాష్ట్రంలో 70 లక్షలకు పైగా జనాభా ఓట్ల బలమున్న మాదిగ జాతికి అన్ని రాజకీయ పార్టీలు అనాదిగా అన్యాయం చేస్తూనే వస్తున్నాయని... ఇప్పటికైనా మనం ఏకమవుదామనిమాదిగలకు మాజీ మంత్రి, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపు నిచ్చారు.అన్నిట్లోనూ అన్యాయమే...జరుగుతుంది.

జనాభా దామాషా ప్రకారం సీట్ల కోసం పోరాడుదాం.. రాజ్యాధికారం కోసం చేయి చేయి కలుపుదాం అని అన్నారు.

**అన్నిట్లోనూ అన్యాయమే...**

రెడ్ల జనాభా ఎంత?.. వారికి 43 అసెంబ్లీ సీట్లు ఎలా ఇచ్చారు.. 70 లక్షల జనాభా ఉన్న మాదిగలకు న్యాయంగా 19 సీట్లు దక్కాలి.. నామ మాత్రపు సీటు ఇచ్చి చేయి దులుపుకున్నారు... మూడు ఎంపీ సీట్లకు గాను ఒక సీటు కూడా మాదిగలకు ఇవ్వలేదు.. ఇక ఎమ్మెల్సీ సీట్లు ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించక అవమానపరిచారు.. ఇది అన్యాయం కాదా అని అన్ని రాజకీయ పార్టీలను మోత్కుపల్లి నర్సింహులు ప్రశ్నించారు. అటు పార్లమెంట్లో గానీ ఇటు శాసనసభ శాసనమండలిలో గాని మాదిగలకు కల్పించిన స్థానం ఎంత అని ఆయన ఆవేదనతో చెప్పుకొచ్చారు .

**ఓట్లు మావి... సీట్లు మీవా?**

పార్టీల జెండాలు మోసి... ఓట్లు వేసి... గెలిపిస్తే మాదిగలకు వారు చేస్తున్న న్యాయం ఎంత?.. పాలకులు, ప్రతిపక్షాలు ఆత్మ విమర్శ చేసుకోవాలి... మాదిగలు రాజకీయ శక్తిగా ఎదగక పోవడానికి కారణం ఎవరు?.. ఇక ఈ అన్యాయాన్ని సహించేది లేదు.. ఉద్యమిస్తాం.. న్యాయం కోసం పోరాడుతాం అని మోత్కుపల్లి అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు... రాబోవు అన్ని ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలి అని మోత్కుపల్లి డిమాండ్ చేశారు. వాస్తవంగా మాది డిమాండ్ కాదు న్యాయం అని స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీలో కొనసాగుతున్న సరే.. తగిన సీట్ల కోసం ఆయా పార్టీల అధిష్టానం పై మాదిగలు తగిన ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

**మాదిగ మహాశక్తి**

ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో మాదిగలకు అనాదిగా జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని.. మాదిగ జాతి సముద్ధరణ కోసం మాదిగ మహాశక్తి ఏర్పాటు చేశాను.. ప్రతి ఊరు నుంచి కనీసం 50 మంది మాదిగ సోదరులు కలిసి రావాలి... న్యాయం కోసం కలిసి నడుద్దాం.. కలిసి పోరాడుదాం.. కలిసి ఉద్యమిద్దాం.. కలిసి సమిష్టిగా రాజ్యాధికారం కోసం పాటుపడదాం అని నరసింహులు పిలుపునిచ్చారు. 30 ఏళ్లు శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజాసేవలో నిమగ్నమయ్యాను.. నా జీవితం మాదిగల సముద్ధరణ కోసం అంకితం... బీసీ,ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీ తదితర అన్ని వర్గాల కోసం తాను అవిశ్రాంతంగా రాష్ట్రంలో పలుచోట్ల సమావే శాలు, సభలు నిర్వహిస్తున్నాను.. తన ఉద్యమం ఎవరికి వ్యతిరేకం కాదు.. మాదిగ జాతి రాజ్యాధికారం కోసమే అని మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. మాదిగలను ఏకం చేసి అన్ని సమస్యలకు పరిష్కారం చూపెట్టాలన్నదే తన ఆరాటం అన్నారు. మాదిగ మహాశక్తి రాష్ట్రంలో మాదిగలకు రాజ్యాధికారం ద క్కేవరకు కృషి చేస్తుందన్నారు.

# రెండు ఎమ్మెల్సీ సీట్లకు 10 మంది పోటీ



**విజయవాడ :** కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల సందడి ముగిసిన వెంటనే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసు మొదలైంది. వచ్చేనెలలో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ ఇద్దరూ గవర్నర్ కోటాలో ఎంపికైన వారే కావడంతో ఆ రెండు స్థానాలను అధికార కూటమి దక్కించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే చాన్స్ రావడంతో కూటమి నేతలు ఎవరికి చాన్స్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. రెండేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న పలువురు నేతలు ఈ సారైనా అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందా? లేక ఈ సారి కూడా 'సారీ' అంటూ చేతులు దులుపుకుంటుందా? అని టెన్షన్ పడుతున్నారు.వచ్చేనెల 27తో శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుందని శాసన మండలి రికార్డులు ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ రెండుస్థానాల భర్తీకి జులైలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. జూన్ లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. కానీ, రకరకాల సమీకరణాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ నలుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సమయంలో పలువురు ఆశావహులకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై వారు ఆశ పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో గత ఎన్నికల సమయంలో సీట్లు కోల్పోయిన త్యాగరాజులే ఎక్కువగా ఉన్నారు. ఇలా ఎమ్మెల్సీ పదవులు కోరుకుంటున్న వారిలో టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా మాజీ మంత్రి, సీనియర్ నేత దేవినేని ఉమాతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, బుద్ధా వెంకన్న, వంగవీటి రాధాకృష్ణ, మహాసేన రాజేశ్ వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేస్తున్నారు.సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కోసం టికెట్ వదులుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో పార్టీ కేడర్ కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తోందని అంటున్నారు. తాజాగా ఆయనను నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతల నుంచి కూడా తప్పించారు. దీంతో వర్మ త్యాగం నిష్ఫలం అయిందని అసంతృప్తి కేడర్ లో వ్యక్తమవుతోందని అంటున్నారు. అయితే వర్మకు తగిన న్యాయం చేయాలని ముఖ్య నేతలు ఇద్దరూ భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఈ సారి ఎమ్మెల్సీ చాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.నిందితుడికి మరణ దండన ఖాయం చేసిన కోర్టు మరోవైపు మైలవరం సీటు వదులుకున్న దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ సీటును త్యాగం చేసిన బుద్ధా వెంకన్న, పి.గన్నవరం నుంచి పోటీకి అవకాశం దక్కినా, చివరి నిమిషంలో అధిష్టానం సూచనతో వెనక్కి తగ్గిన మహాసేన రాజేశ్ కూడా ఎమ్మెల్సీ ఆశావహులుగా గట్టి పోటీ ఇస్తున్నారని చెబుతున్నారు.

### శ్రీ పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆద్వర్యం లో

# ఇంటింటా శ్రీమద్భగవద్గీత పంపిణీ

చౌటుప్పల్ జులై 29 ;శ్రీ పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటాశ్రీమద్భగవద్గీత పంపిణీ కార్యక్రమాన్ని ప్రముఖ సాహితీ వేత్త బడుగు శ్రీరాములు ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని సంక్లిష్టంగా ఉన్న వేదాలను నాలుగు వేదాలుగా విభజించి విభజించి మహాభారత, శ్రీమద్ భాగవతం, మరియు 18 మహా పురాణాలను రచించి విశ్వ మానవాళికి వేగుచుక్క గా నిలిచిన శ్రీమద్ వ్యాసభగవానుడు జన్మించిన గురు పూర్ణిమ ను పురస్కరించుకొని ఇంటింటా శ్రీమద్ భగవద్గీత పుస్తక ప్రసాదాన్ని వెయ్యి కుటుంబాలకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు అధ్యక్షత వహించినఫౌండేషన్ చైర్మన్ శ పాలకుర్ల మురళి గౌడ్ మాట్లాడుతూ సత్యాన్ని, ఆధ్యాత్మిక ధర్మ జీవనాన్ని పాటించుటకు తప్పనిసరిగా శ్రీ భగవద్గీతను ప్రతినిత్యం పఠించాలని అన్నారు. శ్రీ భగవద్గీత మానవ జీవనయానానికి దీపస్తంభవని పేర్కొన్నారు. ఋషులు



రూపొందించిన ధర్మమే ఈ విశ్వానికి ఆధారపీఠమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు యువకులు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఆ ఇల్లే అందరికి ఆదర్శం

**అనంతపురం,** : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలోని నాగప్ప కుటుంబం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆరు తరాలుగా 80 మందికిపైగా కుటుంబ సభ్యులు కలిసి ఉంటూ.. ఉమ్మడి కుటుంబానికి సరైన నిర్వచనం చెప్తున్నారు. ఆ ఇంట్లో పిల్లాపెద్దా అందరూ కలిసి 85 మంది వరకూ ఉంటారు. వీరిలో 25 మంది వరకూ విద్యార్థులే కావడం విశేషం. ఈ కుటుంబానికి వేరువేరు చోట్ల కలిపి 127 ఎకరాల వరకూ భూమి ఉంది. మగాళ్లు అందరూ ఈ భూమిలో సేద్యం పనులు చూస్తుంటారు. వీరందరికీ వేరువేరుగా ఇళ్లు ఉన్నా కూడా.. వంట మొదలుకుని సేద్యపు పనులు, ఆదాయం వరకూ అంతా ఉమ్మడిగానే జరుగుతుంది.నాగప్ప ఉమ్మడి కుటుంబంలో మొత్తం 85 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. అయితే అందరూ కలిసి ఒకేచోట వండుకుంటారు. కుటుంబంలోని మహిళలు అందరూ కలిసి.. ఉమ్మడి కుటుంబం మొత్తానికి కావాల్సిన వంట ఏర్పాట్లు చూస్తారు. ఒకే వంటగదిలో భోజనం తయారుచేస్తారు. కుటుంబం మొత్తానికి సరిపడాలంటే రోజూ 80 కిలోల బియ్యాన్ని వండాల్సి వస్తుందని మహిళలు చెప్తున్నారు. ఇక ఆదివారం రోజులలో నాన్ వెజ్ రుచిచూడాలంటే కనీసం 30 కేజీల మటన్ లేదా చికెన్ కావాల్సిందేనని చెప్తున్నారు. ఉదయం ఐదు గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటల వరకూ వంటగదిలో పొయ్యి మంట మండాల్సిందేనట.అయితే ఆరు తరాలుగా.. వీరంతా కలిసి ఉండటానికి బావా బావమరుదులు తీసుకున్న నిర్ణయమే కారణమట.. ఆరునూరైనా మనం కలిసే ఉందామంటూ అరవై సంవత్సరాల కిందట తీసుకున్న నిర్ణయమే వీరంతా ఇలా కలిసి ఉండటానికి కారణంగా చెప్తున్నారు. ఈ కుటుంబానికి మూలమైన నాగప్పకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒకే కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే తన పిల్లలు అందరూ ఒకేచోట కలిసి ఉండాలనే ఉద్దేశంతో నాగప్ప.. పెద్ద భార్య కూతురికి ఇల్లరికం పెళ్లి చేసి అల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దంపతులకు నలుగురు మగపిల్లలు సంతానం.వీరిలోని హనుమంతరాయుడు.. నాగప్ప రెండో భార్య కొడుకు ముత్యాలప్ప (బావమరిది) కలిసి తమ తాతగారి మాట ప్రకారం ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి వీరంతా కలిసే ఉంటున్నారు. ఈ ఇంట్లో కూడా ఎక్కువగా ఇల్లరికం వివాహాలే జరుగుతుంటాయి. అలా కొడుకులు, మనవళ్లూ, మనవరాళ్లూ, మునిమనవరాళ్లూ ఇలా అందరూ కలిసి 85 మంది అయ్యారు.ఈ కుటుంబానికి 127 ఎకరాల భూమి ఉంది. అలాగే70 వరకూ గేదెలూ, 40 ఆవులూ, వేయికిపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. సేద్యం ద్వారా ధాన్యం, కూరగాయలు పండిస్తున్నారు. ఇలా పండించిన వాటిలో కుటుంబ అవసరాలు పోనూ మిగతా వాటిని మార్కెట్లో విక్రయిస్తుంటారు. అలాగే నాలుగు ప్రైవేటు బస్సులను నడుపుతూ.. ఏటా 20 లక్షలు సంపాదిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఉమ్మడి కుటుంబంకోసం వెచ్చిస్తున్నారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే వేయి రూపాయలు దాటిన ఏ ఖర్చుకు అయినా.. కుటుంబ పెద్దలు హనుమంతరాయుడు, ముత్యాలప్పల నిర్ణయం తప్పనిసరి. అలా ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు నిలువెత్తు నిదర్శనంగా ఈ ఫ్యామిలీ నిలుస్తోంది.

# 68 మండలాల్లో డేంజర్

**విజయవాడ:** ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...



**విశాఖపట్టణం, జూలై 22 :** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేవీూ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను

**విశాఖపట్టణం,** : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా




వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

# ఎడ్యుకేషన్ హబ్ గా హైదరాబాద్



**హైదరాబాద్,** : తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి (ట్రైసిటీస్) జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం, అత్యధిక సంఖ్యలో కాలేజీలు కలిగిన జిల్లాల జాబితాలో ఈ మూడు జిల్లాలు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ కోర్సులు, వేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగంతో పాటు మహిళల భాగస్వామ్యం ఊహించని స్థాయిలో పెరగడం తెలంగాణ విద్యా రంగానికి కొత్త ఊపిరి పోసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు దేశంలోనే ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రాలుగా మరింత బలపడుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ తాజా నివేదికలో ఈ మూడు జిల్లాలు దేశంలో అత్యధిక కాలేజీలు ఉన్న జిల్లాల జాబితాలో అగ్రస్థానాల్లో నిలిచాయి. విస్తృతంగా పెరిగిన విద్యాసంస్థలు, ఆధునిక కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, ఐటీ రంగం విస్తరణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందుతున్న విద్యా విధానాలు ట్రైసిటీస్‌ను దేశంలోనే ప్రముఖ విద్యా కేంద్రంగా నిలబెట్టాయని నివేదిక స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలో 480కు పైగా, రంగారెడ్డి జిల్లాలో 390కు పైగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 310కు పైగా ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. సంప్రదాయ డిగ్రీ కళాశాలలతో పాటు వైద్య, న్యాయ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి విభిన్న రంగాల్లో విద్యను అందించే సంస్థలు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. జాతీయ సగటుతో పోలిస్తే ప్రతి లక్ష జనాభాకు లభిస్తున్న కాలేజీల సంఖ్య కూడా ఈ జిల్లాల్లో ఎక్కువగా ఉండటం మరో ప్రత్యేకతగా నివేదిక పేర్కొంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, స్టార్టప్ రంగాలకు కేంద్రంగా ఎదగడం ఉన్నత విద్యపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులకు భారీగా డిమాండ్ పెరిగింది. నివేదిక ప్రకారం ఈ రెండు జిల్లాల్లో 45 శాతానికి పైగా విద్యార్థులు (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ట్రిపుల్ ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీ రేటు గతంతో పోలిస్తే మెరుగుపడిందని సర్వే తెలిపింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరగడం, పరిశ్రమలతో విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అధికంగా లభించడం వల్ల విద్యార్థులు ఈ ప్రాంతంలోని కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. మహిళల ఉన్నత విద్యలో పాల్గొనడంలో కూడా ట్రైసిటీస్ విశేష పురోగతి సాధించాయి. ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ కోర్సులకే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఇంజినీరింగ్, టెక్నాలజీ, పరిశోధన, సైన్స్ రంగాల్లో కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉన్నత విద్యలో అమ్మాయిల నమోదు అబ్బాయిల కంటే ఎక్కువగా నమోదైంది. పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత స్థాయి పరిశోధన కోర్సుల్లో మహిళల నమోదు జాతీయ సగటును మించి ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనంగా నివేదిక పేర్కొంది. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు, భద్రతా ప్రమాణాల మెరుగుదల కూడా ఇందుకు కారణాలుగా గుర్తించింది. మౌలిక వసతుల పరంగా కూడా హైదరాబాద్ ట్రైసిటీస్ దేశంలోని ఇతర విద్యా కేంద్రాలకు పోటీ ఇస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 90 శాతానికి పైగా కాలేజీల్లో వైఫై, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని సర్వే తెలిపింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యం పెరగడంతో ల్యాబ్‌ల ఆధునీకరణ కూడా వేగంగా జరుగుతోందని పేర్కొంది. కౌన్సెలింగ్ కేంద్రాలు, పరిశోధన ఇంక్యుబేషన్ సెంటర్లు, క్రీడా వసతుల కల్పనలో కూడా ఈ జిల్లాలు ముందంజలో ఉన్నాయని వెల్లడించింది. అయితే విద్యార్థుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో హాస్టల్ సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది. అధ్యాపకుల ఖాళీల భర్తీ, పరిశ్రమలతో మరింత అనుసంధానం, పరిశోధనకు ప్రాధాన్యం పెంచడం వంటి చర్యలు చేపడితే హైదరాబాద్ ట్రైసిటీస్ దేశానికే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రముఖ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ నివేదిక అభిప్రాయపడింది.

# బెంగాల్ లో ఊపిరిపోసుకుంటున్న లెఫ్ట్ పార్టీలు



**కోల్ కత్తా,** : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన తృణమూల్ కాంగ్రెస్ నేడు తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని నిలబెట్టేందుకు పడుతున్న ఆరాటం, సీనియర్ నేతల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అధికారం పోవడంతో పార్టీ ముఖ్యనేతలందా గుడ్ బై చెప్పేశారు. ప్రతిపక్ష రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సీపీఎంకు ఓ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఈ రాజకీయ పరిణామం సుదీర్ఘకాలం 34 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఖఎ-ఓ కి, లెఫ్ట్ ఫ్రంట్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని తలుపు తడుతోంది. 2011లో మమతా తుఫాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత, సురక్షిత స్థావరం కోసం సీపీఎం కేడర్ పెద్ద ఎత్తున బిజెపి, టిఎంసి వైపు వలస వెళ్లారు. అయితే, గ్రామీణ బెంగాల్‌లో సీపీఎం నిశ్శబ్ద మూలాలు, సైద్ధాంతిక బలగాలు నేటికీ చెక్కుచెదరలేదు. తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలికంగా ఇతర జెండాలు పట్టిన శ్రేణులు, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం, మమతా పార్టీ నిర్వీర్యం అవుతున్న సూచనలు కనిపిస్తూండటం?తమళ్లీ ఎర్రజెండా వైపు చూస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ నేతలు పాత పద్ధతులను విడనాడి, కొత్త వ్యూహాలతో శ్రేణులను జాగృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మీనాక్షి ముఖర్జీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన యువనాయకులను ముందుంచి, కార్మికులు-రైతులు-యువత అజెండాతో బెంగాల్‌ను కాపాడుకుందాం పేరిట విస్తృత పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మత-కులాతీత రాజకీయాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా సీపీఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తోందిఅయితే, సైద్ధాంతికంగా సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ఆచరణలో సీపీఎం ముందు కొండంత సవాళ్లు నిలిచాయి. దశాబ్దకాలంగా అమానుష దాడులకు గురై దెబ్బతిన్న గ్రామస్థాయి కార్యకర్తలకు మాస్ ప్రొటెక్షన్ కల్పించడంలో పార్టీ అగ్రనాయకత్వం ఇంకా సంపూర్ణ విశ్వాసాన్ని నింపలేకపోతోంది. పైగా, కాంగ్రెస్ పార్టీతో చేసుకుంటున్న తాత్కాలిక పొత్తులు క్షేత్రస్థాయిలో ఓటర్లలో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. తమ పూర్వపు ఓటు బ్యాంకును ఆకర్షించడంలో లెఫ్ట్ ఫ్రంట్ వేస్తున్న అడుగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా చాలా పోరాటం చేయాల్సిఉంది. తృణమూల్ ఎంత బలహీనపడితే సీపీఎంకు అంత మేలు జరుగుతుంది. పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా అవతరించే అర్హత, సైద్ధాంతిక పునాది సీపీఎంకి మాత్రమే ఉన్నాయి. బీజేపీ వైపు వెళ్లిన తమ పాత ఓటర్లను ఇంటికి రప్పించడంలోనూ, యువతలో ఉపాధి రాజకీయాల పట్ల నమ్మకం కలిగించడంలోనూ సీపీఎం నేతలు ఎంతవరకు సఫలమవుతారో అనే దానిపైనే బెంగాల్‌లో ఎర్ర సూర్యుడి పునరాగమనం ఆధారపడి ఉంటుంది.

# హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..

## -రూ.345 కోట్లతో 6 లేన్లు.. మరింత వేగంగా ఎయిర్‌పోర్టుకు ప్రయాణం

**హైదరాబాద్,** : హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జీహెచ్‌ఎంసీ మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు రెడీ అయింది. రూ.345 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాతబస్తీ, ఎల్‌బీ నగర్, కంచన్‌బాగ్, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు మరింత వేగంగా ప్రయాణం సాగనుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా ఆదా కానుంది. ఈ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను జీహెచ్‌ఎంసీ వేగవంతం చేస్తోంది. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పాతబస్తీ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే లక్ష్యంతో కీలక ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు సిద్ధమైంది. మైలార్‌దేవ్‌పల్లి నుంచి కాటేదాన్, శంషాబాద్ రోడ్ వరకు ఆరు లేన్ల గ్రేడ్ సెపరేటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. సుమారు రూ.345 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఫ్లైఓవర్‌కు పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. అధికారిక ఆమోదం కోసం ఎదురుచూస్తూనే ప్రాజెక్టు ఆలస్యం కాకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, శంషాబాద్ రోడ్ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో నరకం అనుభవించే వాహనదారులకు భారీ ఉపశమనం లభించనుంది. ముఖ్యంగా పాతబస్తీ, కంచన్‌బాగ్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓవైసీ ఫ్లైఓవర్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ దాటిన తర్వాత మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్ వద్ద భారీ ట్రాఫిక్ కారణంగా ఆ మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా అవసరమైన భూసేకరణ ప్రక్రియపై కూడా జీహెచ్‌ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. భూమి యజమానులకు ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వడం లేదా అవసరమైతే నష్టపరిహారం చెల్లించడం ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర దక్షిణ భాగంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత మెరుగుపడి.. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి కొత్త ఊపు రానుంది.

# ఆందోళనలతో ఢిల్లీ...



**న్యూఢిల్లీ,** : ఢిల్లీ నగరం ఆందోళనలతో అట్టుడికి పోతుంది. గతంలో కేంద్రం వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. అప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన కొంతమంది రైతులు అందులో పాల్గొన్నారు. ఇదే అదునుగా ఖలీస్థానీ వేర్పాటు వాదులు అందులోకి ప్రవేశించారు. సరిగ్గా గణతంత్ర దినోత్సవం జరిగిన తర్వాత ఎర్రకోట మీద ఖలీస్థానీ జెండా ఎగరవేశా. దీంతో ఈ రైతు ఉద్యమం వెనుక ఉన్న అజెండా ఏమిటో అందరికీ అర్థమైంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. తద్వారా యూపీ ఎన్నికల్లో విపక్ష పార్టీలు ఊహించని విధంగా స్కెచ్ వేశారు. దీంతో ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మనదేశంలో ఉద్యమాల వెనుక ఉన్న శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయో నాడు ఈ సంఘటన బయటకు తెలిసేలా చేసింది. ఇప్పుడు ఢిల్లీలో కొంతమంది ఉద్యమాలు చేస్తున్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నీటి పేపర్ లీకేజీ.. విద్యార్థుల ఆత్మహత్యలు వంటిఘటనలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇటీవల సోనం వాంగ్ చుక్ నిరధిక నిరాహార దీక్షకు దిగారు. ఆ తర్వాత ఆయన దీక్షను ప్రభుత్వం విరమింపజేసింది. ఆయన ఢిల్లీలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సరిగా నిన్న ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. చలో పార్లమెంట్ నినాదంతో ఢిల్లీ నగరంలో హడావిడి చేశారు. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పడంతో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కిసాన్ ఘాట్ వద్ద రైతులు నిరసన తెలపడం మొదలుపెట్టారు. వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. భారత్ అమెరికా వాణిజప్పంలో భాగంగా తక్కువ ధరకు.. రాయితీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్లే శంభు బార్డర్ (పంజాబ్, హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకున్నారు. అటు బొద్దింకలు.. ఇటు రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి బిజెపికి విపత్కర పరిస్థితి తప్పదా అంటూ విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కూడా రైతుల ఉద్యమం ముసుగులో చాలామంది ఢిల్లీలో తిష్ట వేసుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే పోలీసులు సమర్థవంతంగా అడ్డుకోవడంతో వారి పాచికలు పారలేదు. ఇప్పుడు మళ్లీ నీట్.. అమెరికా ఒప్పందం వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. అయితే దీని వెనక కూడా విదేశీ శక్తులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అందువల్లే ఈ ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కి వేస్తున్నాయి.

# హరీష్ ఇంపాక్ట్ ...పాదయాత్రలో తగ్గని క్రేజ్



**మెదక్,** : తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గోదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది. కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్‌ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత సమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్‌ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ పవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు. వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్‌ఎస్ పార్టీకి ప్రధాన పునరుత్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్‌ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.

# హ్యాట్రిక్ కోసం యోగీ వ్యూహాలు



**లక్నో** : ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం దేశవ్యాప్తంగా పాలనా అధికారం కోసం పోటీపడే ఏ పార్టీకైనా అత్యంత కీలకమైన మెట్టు. ఈ రాష్ట్రం 80 లోక్‌సభ స్థానాలతో దేశంలోనే అత్యధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. పశ్చిమ భారతదేశం మొత్తం కలిపినా ఇంతకంటే తక్కువ స్థానాలు ఉంటాయి. తూర్పు భారతదేశం సీట్ల సంఖ్యతో యూపీ సమానంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారం నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలనే ప్రయత్నంలో పార్టీ ఇప్పటి నుంచే గ్రాస్‌రూట్స్ స్థాయిలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. 2019లో బీజేపీ యూపీలో 62 సీట్లు గెలవగా, 2024లో కేవలం 33 సీట్లకు పరిమితమైంది. ఈ భారీ పతనం పార్టీని ఆత్మపరిశీలనకు దారితీసింది. 400 సీట్ల టార్గెట్‌ను చేరుకోలేకపోవడం వెనుక యూపీలోని నష్టాలు ప్రధాన కారణం. ఇకపై కులం, మతం ఆధారంగా కాకుండా పనితీరు, పాలనా ఫలితాల ఆధారంగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మార్పు యోగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రజల ముందు పెట్టడం ద్వారా విశ్వాసం పెంచే దిశగా ఉంది. బీజేపీ 18 జిల్లాల్లోని 64 అసెంబ్లీ స్థానాలను 'స్వింగ్ సీట్లు'గా గుర్తించి, వాటిపై ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఇక్కడ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఓట్ల శాతం, ఇతర పార్టీల పనితీరు వివరంగా విశ్లేషించబడుతోంది. ఈ సీట్లలో బీజేపీ 10 వేల ఓట్లలోపు మెజారిటీతో ఓడిపోయినట్లు గుర్తించింది. ఇవి త్వరగా తిరిగి సాధించగల స్థానాలుగా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి, సంఘటన మంత్రి ధరమ్‌పాల్ సింగ్ ఈ 64 సీట్లను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించి, వారిని ఎన్నికల వరకు అక్కడే ఉంచి క్షేత్రస్థాయి పని చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది వనరులను సమర్థవంతంగా వినియోగించి, లక్ష్య సాధనకు సహాయపడే విధానం. హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అమలు చేసిన వ్యూహాల నుంచి యూపీకి పాఠాలు నేర్చుకుంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో కూడా బీజేపీ 14 దళాలతో సంస్థాగతంగా బలపడింది. 44 ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లోనూ, మిగతా ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమావేశాలు నిర్వహించి, వాలంటీర్లను నియమించి గ్రాస్‌రూట్స్ స్థాయిలో పని చేసింది. ఇదే తరహా విధానాన్ని యూపీలో కూడా అమలు చేస్తోంది. ఇప్పటికే యూపీలో 15 వేల గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపు రోజుకు 30 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక వేసింది. ఎన్నికల నాటికి ఐదు లక్షల సమావేశాలు జరిపి, ప్రజాభిప్రాయాన్ని తన వైపుకు మళ్లించాలని లక్ష్యం. ఈ సమావేశాల ద్వారా పార్టీ పాలనా ఫలితాలు, యోగి ప్రభుత్వం చేసిన పనులు నేరుగా ఓటర్లకు చేరవేయడం, అనుమానాలు నివృత్తి చేయడం సాధ్యమవుతుంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 40 లక్షల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలు విని, పార్టీ, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతప్తిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు, నిజమైన అభిప్రాయ సేకరణ మరియు సమస్య పరిష్కార విధానం. 64 స్వింగ్ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఈ పని మరింత తీవ్రంగా జరగనుంది. ఈ విధానం ద్వారా బీజేపీ 'పాలనా పనితీరు'ను ప్రధాన అంశంగా ముందుకు తెచ్చి, సాంప్రదాయకంగా జరిగే ఓటు బ్యాంకు రాజకీయాలను అధిగమించాలని చూస్తోంది. బీజేపీ వ్యూహం రెండు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉంది. ఒకటి ? లక్ష్య సాధన. 64 స్వింగ్ సీట్లపై దృష్టి పెట్టడం వల్ల వనరులు వృథా కాకుండా, ఫలితాలు త్వరగా రావచ్చు. రెండు ? గ్రాస్‌రూట్స్ సంస్థాగతీకరణ. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన మోడల్‌ను అనుసరించడం వల్ల అనుభవం ఉంది. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు బీజేపీని ఆపడానికి కలిసి పని చేయవచ్చు. యోగి ప్రభుత్వం చేసిన పనులను ఓటర్లు ఎంతవరకు గుర్తిస్తారు, స్థానిక అసంతృప్తులు ఎంతవరకు తొలగుతాయి అనేది నిజమైన పరీక్ష. మొత్తంమీద బీజేపీ ఇప్పటి నుంచే సమగ్రమైన, క్షేత్రస్థాయి కేంద్రిత వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2027లో యోగి ఆదిత్యనాథ్ మూడోసారి సీఎంగా రావాలంటే ఈ స్వింగ్ సీట్లు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

## పచ్చి బఠానీలు..
### పసుపు బఠానీలుఏవి ఆరోగ్యానికి మంచివి?



పచ్చి, పసుపు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేసి ఇంటికి తీసుకురండి.పచ్చి లేదా పసుపు బఠానీలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. అయితే, శీతాకాలంలోనే ఎక్కువగా పచ్చి బఠానీలను మార్కెట్లో అమ్ముతారు. ఆ తర్వాత, మీరు ఏడాది పొడవునా ఎండబెట్టిన బఠానీలను మాత్రమే తినవచ్చు. పచ్చి బఠానీలను ఎండబెట్టిన తర్వాత, వాటిని పసుపు బఠానీల పేరుతో మార్కెట్‌లో కూడా అమ్ముతారు. ఎండబెట్టిన తర్వాత, పచ్చి బఠానీలు పసుపు రంగులోకి మారుతాయి. కానీ, కొన్నిసార్లు ఎండిన పచ్చి బఠానీలు కూడా మార్కెట్లో లభిస్తాయి. ఇది వేరే రకమైన బఠానీలు. ఎండబెట్టిన తర్వాత కూడా ఈ బఠానీలు పచ్చగా ఉంటాయి. రెండు రకాల పోషక విలువలు కూడా దాదాపు ఒకే విధంగా ఉంటాయి. అయితే, రెండు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేయాలి. వంట కోసం మీరు పచ్చి బఠానీలు లేదా పసుపు బఠానీలను ఉపయోగించవచ్చు. అయితే, వాటి రుచిలో స్వల్ప తేడా ఉంటుంది. పచ్చి బఠానీలు తక్కువ స్టార్చ్ కలిగి ఉంటాయి, పసుపు బఠానీల కంటే తియ్యగా ఉంటాయి. పసుపు బఠానీలు మట్టి, వగరు రుచిని కలిగి ఉంటాయి. అవి పచ్చి బఠానీల కంటే తేలికపాటివి, తక్కువ ఘాటుగా ఉంటాయి. మీ ఆహారంలో బలమైన బఠానీ రుచి ఉండకూడదనుకుంటే.. పసుపు బఠానీలు ఉత్తమం. రెండు రకాల ఎండిన బఠానీలు వండడానికి దాదాపు ఒకే సమయం పడుతుంది. ఆకుపచ్చ, పసుపు బఠానీలు రెండింటిలోనూ ప్రోటీన్, ఫైబర్, విటమిన్ బి, మెగ్నీషియం, ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. ఈ బఠానీలు కాల్షియం, జింక్, నియాసిన్, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం కోసం మీ రోజువారీ అవసరాలను తీర్చగలవు. బరువు తగ్గడానికి బఠానీలు ఒక అద్భుతమైన ఎంపిక. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి. అవి ఆకలిని నియంత్రించడానికి, జీవక్రియను పెంచడానికి మంచివి. ఈ చిన్న బఠానీలు శక్తినిచ్చే పోషకాలను కలిగి ఉంటాయి. బఠానీలు వాపును తగ్గిస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి, రక్తపోటును నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.

## రోజూ నిమ్మకాయ నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదేనా?



నిమ్మకాయ.. మన వంటింట్లో సులభంగా దొరికే అద్భుత ఔషధం. విటమిన్-సి, పొటాషియం, ఫ్లేవనాయిడ్లకు నిలయమైన నిమ్మరసాన్ని రోజూ తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలిసిందే. అయితే దీనిని ఎంతకాలం తాగాలి..? ఎప్పుడు తాగితే మంచిది..? ఆయుర్వేదం ఏం చెబుతోంది? జీర్ణక్రియకు - బరువు తగ్గడం: యలో ఉండే ఆమ్ల రసం వాత, కఫ దోషాలను తొలగిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది జీర్ణశక్తిని పెంచడమే కాకుండా శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపుతుంది. ముఖ్యంగా ఊబకాయం తగ్గాలనుకునే వారు 15 నుండి 21 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడి మంచి ఫలితాలు కనిపిస్తాయి.నెల రోజులు తాగితే: సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం 20-30 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవచ్చు. అయితే ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. ఒక నెల పాటు వరుసగా నిమ్మరసం తాగిన తర్వాత, కనీసం ఒక వారం పాటు విరామం ఇవ్వడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరం సహజ సమతుల్యతను కాపాడుకుంటుంది. రోజూ ఎంత తాగాలి? ఎలా తాగాలి?: శాస్త్రీయ కోణంలో చూస్తే నిమ్మరసం చాలా ఆరోగ్యకరమైన డ్రింక్. కానీ దీనిని పరిమితంగా తీసుకోవడమే క్షేమకరం. రోజుకు ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయను పిండుకుని తాగడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని తీసుకుని, అందులో నిమ్మరసం కలిపి తాగాలి.

## మంచిదని ఫుల్లుగా తాగుతున్నారా..?



అతిగా నీరు తాగడం మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. తరచుగా మూత్రవిసర్జన, వాపు, తలనొప్పి వంటి లక్షణాలు అధిక హైడ్రేషన్‌ను సూచిస్తాయి. మీ వయస్సు, బరువు, శారీరక శ్రమను బట్టి రోజుకు 2-3 లీటర్లు తాగడం సరిపోతుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాల కోసం సమతుల్య జీవనశైలి అవసరం. మీరు ఎంత ఎక్కువ నీరు తాగితే అది మీ శరీరానికి, పిండాలకు అంత మంచిదని చాలా మంది నమ్ముతారు.. ఇలానే రోజు మొత్తంలో ఎక్కువ నీరు తాగుతారు.. అయితే.. మూత్రపిండాల పని రక్తాన్ని శుభ్రపరచడం, శరీరం నుండి అవసరమైన, విషపూరిత పదార్థాలను వేరు చేయడం.. మూత్రం ద్వారా వాటిని విసర్జించడం. మనం తాగే నీరు ఈ ప్రక్రియలో సహాయపడుతుంది.

కానీ నీటిని అధికంగా వినియోగించినప్పుడు, అది మూత్రపిండాలపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది.. శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల తరచుగా మూత్ర విసర్జన, వాపు, తలనొప్పి , అలసట, వికారం, కొన్నిసార్లు తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందికి చేతులు, కాళ్ళు బరువుగా ఉండటం, నిద్ర పట్టడంలో ఇబ్బంది కలగవచ్చు. ఈ సంకేతాలు శరీరం అవసరమైన దానికంటే ఎక్కువ నీటిని తీసుకుంటున్నట్లు సూచిస్తాయి. ఢిల్లీ ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీని గురించి సవివరంగా వివరించారు. ఒక వ్యక్తి నిరంతరం అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు, మూత్రపిండాలు దానిని పదే పదే ఫిల్టర్ చేయాల్సి వస్తుంది. ఇది మూత్రపిండాల సామర్థ్యంపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. అధిక నీరు శరీరంలోని ఉప్పు, ఇతర ఎలక్ట్రోలైట్‌ల సమతుల్యతను దెబ్బతీస్తుంది.. దీని వలన సోడియం స్థాయిలు తగ్గుతాయి. ఈ స్థితిలో, కణాలలో నీరు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది, ఇది మెదడు, కండరాలకు హానికరం కావచ్చు. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, మూత్రం చాలా పాలిపోయినట్లు కనిపించడం లేదా తరచుగా మూత్రవిసర్జన చేయడం కూడా ఒక సంకేతం కావచ్చు. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, ఇప్పటికే బలహీనమైన మూత్రపిండాలు ఉన్నవారిలో సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, ఎక్కువ నీరు త్రాగడం వల్ల మూత్రపిండాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది.. అని వివరించారు. నీటి అవసరాలు ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండవు. అవి వయస్సు, బరువు, వాతావరణం, శారీరక శ్రమ, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా, రోజుకు 2 నుండి 3 లీటర్ల నీరు సరిపోతుందని భావిస్తారు. వేడి వాతావరణంలో లేదా మీరు అధికంగా చెమట పట్టినట్లయితే ఈ మొత్తాన్ని కొద్దిగా పెంచవచ్చు. దాహం వేసినప్పుడు నీరు త్రాగడం, మీ మూత్రం రంగును గమనించడం సులభమయిన మార్గం.. లేత పసుపు రంగు సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మీ మూత్రం స్పష్టంగా, తరచుగా వస్తూ ఉంటే, అది అధిక హైడ్రేషన్‌కు సంకేతం కావచ్చు. మీ వైద్యుడిని సంప్రదించకుండా మీరు ఎక్కువ నీరు తాగే అలవాటును పెంచుకోకూడదు. మీ మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీరు మాత్రమే కాదు, సమతుల్య జీవనశైలి కూడా అవసరం. మీ ఉప్పు తీసుకోవడం పరిమితం చేయండి.. వేయించిన ఆహారాలను నివారించండి. క్రమం తప్పకుండా భోజనం చేయండి.. తగినంత నిద్ర పొందండి.

## ఈ చేప తింటే ఆ సమస్యలన్నీ మాయం



అధిక రక్తపోటు, మధుమేహం, కొవ్వు సమస్యలతో సతమతమవుతున్నారా? అయితే చేపల ప్రియుల కోసం ఒక శుభవార్త.. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. పండుగప్ప చేపను తినడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తేలింది. నాన్‌వెజ్ ప్రియుల బాగా ఇష్టంగా తినేది చేపలు. చేపల పులుసు, చేపల ఫ్రై అంటే చాలా మందికి పిచ్చి. అయితే మీరు మార్కెట్‌కు వెళ్లే ముందు ఈ విషయం తెలుసుకోండి. మీరు బరువు తగ్గాలని చూస్తున్నారా? లేదా కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే పండుగప్ప చేప మీ ఆహారంలో ఉండాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం..

కొడువా చేప కేవలం రుచిలోనే కాదు ఆరోగ్య ప్రయోజనాల్లోనూ మేటి అని తేలింది. ముఖ్యంగా రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 2017-18లో పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు నిర్వహించిన పరిశోధన ఫలితాలు గతేడాది విడుదలయ్యాయి.

ఈ నివేదిక ప్రకారం.. పండుగప్ప చేప రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టమైంది. పండుగప్ప చేపలో ఉండే ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

## సర్ డిక్లరేషన్ లో చేర్పులు వద్దు ఈసీకి జాన్ బ్రిట్టాస్ లేఖ...

న్యూఢిల్లీ : కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6 ఆన్‌లైన్ దరఖాస్తులో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన కొత్త డిక్లరేషన్‌ను చేర్చిన ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయంపై సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పు చట్టబద్ధ అధికార పరిధిని దాటి చేసిన చర్యగా (అల్ట్రా వైర్స్) కనిపిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ఆ నిబంధనను ఉపసంహరించుకోవాలని వివరించారు. ఈ మేరకు జాన్ బ్రిట్టాస్.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త ఓటరు.. ఆయన తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు సర్ అనంతరం రూపొందించిన ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా అనే వివరాలను తప్పనిసరిగా ప్రకటించాల్సి వస్తోంది. అయితే డౌన్‌లోడ్ చేసుకునే ఆఫ్‌లైన్ ఫారం'6లో మాత్రం ఈ నిబంధన లేదు. సాధారణంగా ఫారం'6లో మార్పులు చేయాలంటూ ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 లేదా రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో సవరణలు చేయాల్సి ఉంటుందనీ, అలాంటి చట్టసవరణలు లేకుండానే ఈసీ కొత్త ప్రకటనను చేర్చిందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. అందువల్ల ఈ చర్యకు చట్టబద్ధమైన ఆధారం లేదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-324 ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీకి విస్తృత అధికారాలు ఇచ్చినప్పటికీ.. పార్లమెంటు రూపొందించిన చట్టాలను మార్చే అధికారం ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసేవారికే అదనపు షరతు విధించడం, ఆఫ్‌లైన్ దరఖాస్తుదారులకు అది వర్తించకపోవడం రాజ్యాంగంలోని సమానత్వ హక్కు (ఆర్టికల్ 14)కు విరుద్ధమని బ్రిట్టాస్ పేర్కొన్నారు. మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకునే యువత, విద్యార్థులు, వలస కార్మికులు, అనాథలు, దత్తత పిల్లలు, కుటుంబాలకు దూరమైనవారు, ఎన్నో ఏండ్ల క్రితం ఇతర నియోజకవర్గాలకు మారిన కుటుంబాల వారికి పాత ఓటరు వివరాలు సమర్పించడం ఆచరణలో సాధ్యం కాదని



ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 2002-03లో రూపొందించిన పాత ఓటర్ల జాబితాలు కూడా చాలా చోట్ల అందుబాటులో లేవని గుర్తు చేశారు. ఈ కొత్త డిక్లరేషన్ లేకపోవడం వల్ల ఏ దరఖాస్తునూ తిరస్కరించకూడదనీ, పెండింగ్‌లో ఉంచకూడదని ఎన్నికల కమిషన్‌ను ఆయన కోరారు. ఇలాంటి నిబంధన అవసరమని ఈసీ భావిస్తే.. చట్టబద్ధంగా సంబంధిత నిబంధనల్లో సవరణలు చేసి మాత్రమే అమలు చేయాలని సూచించారు. అయితే ఈసీకి చెందిన ఒక అధికారి పీటీఐతో మాట్లాడుతూ.. ఫారం-6ను అధికారికంగా సవరించలేదనీ, కేవలల పరిపాలనా సూచనల ద్వారానే ఈ డిక్లరేషన్‌ను చేర్చామని చెప్పారు. దీనితో కొత్త ఓటర్ల వివరాలను గుర్తించడం సులభమవుతుందని, అవసరమైన పత్రాల సంఖ్య కూడా తగ్గుతుందని వివరించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన సర్ ప్రక్రియపై ఇప్పటికే వివాదం నెలకొన్న నేపథ్యంలో.. ఫారం'6లో ఈ కొత్త డిక్లరేషన్ చేర్పు మరోసారి ఎన్నికల కమిషన్ చర్యలపై చర్చకు దారి తీసింది.


## భారత్‌లో కార్యకలాపాలు విస్తరిస్తున్న పాక్ గ్యాంగ్‌స్టర్..!



భారత్‌లో తన ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరించడానికి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. 2024లో పంజాబ్ యూట్యూబర్ రోజెర్ సంధూ ఇంటి వద్ద కాల్పుల కేసులో ఐఎస్ఐతో సంబంధమున్న పాక్ గ్యాంగ్‌స్టర్ పేరు బయటకు రావడంతో ఈ అనుమానం నెలకొంది. భారత్‌లో జరిగిన పలు దాడుల్లో పాక్ గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీ హస్తం ఉంది. గతంలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కూడా అతడి పేరు బయటకు వచ్చింది. అతడు దుబాయ్‌లో ఉంటూ భారత్‌లో దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. 2024లో పంజాబ్‌లోని యూట్యూబర్ రోజెర్ సంధూ ఇంటి వద్ద కాల్పుల వెనక షహజాద్ భట్టీ ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని నెలలుగా అతడు సోషల్ మీడియా వేదికగా.. మతపరమైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నాడు. వాటితో దేశంలో పలు ప్రాంతాల్లోని యువతను

ఉగ్రవాదం వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా అతడితో సంప్రదింపులు జరుపుతున్న మధ్యప్రదేశ్, యూపీ, జమ్మూకశ్మీర్, పంజాబ్, గుజరాత్‌లకు చెందిన 9 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దిల్లీ సహా దేశంలోని ప్రసిద్ధ రెస్టారంట్లు, షహజాద్ వీరికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తమ ముఠా ప్రపంచవ్యాప్తంగా 16-17 దేశాలలో విస్తరించి ఉందని షహజాద్ చెబుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## 'హంటా వైరస్' నౌకలోని భారతీయులు నెదర్లాండ్స్‌కు..




### - ప్రయాణికులను ప్రత్యేక విమానంలో స్వదేశాలకు తరలిస్తున్న సిబ్బంది

**టెనెరిఫ్ :** హంటా వైరస్ కలకలానికి కేంద్ర బిందువైన క్రూజ్ నౌక ఎండీ హొండియస్ నుంచి ప్రయాణికులను వారి స్వదేశాలకు తరలించే ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. పశ్చిమాఫ్రికాలోని టెనెరిఫ్ ద్వీపంవద్ద నిలిచిన ఈ నౌక నుంచి ప్రయాణికులను ముందు చిన్న పడవల్లో తరలిస్తున్నారు. అనంతరం అక్కడి నుంచి విమానాల్లో వారి దేశాలకు పంపనున్నారు. మన దేశానికి చెందిన ఇద్దరు నౌకా సిబ్బందిని ప్రస్తుతానికి నెదర్లాండ్స్‌కు తరలించారు. హొండియస్ నౌకలో ఉన్న 140 మందిలో ఈ వైరస్ లక్షణాలు కనిపించలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) స్పష్టం చేసింది. ఈ వైరస్ వ్యాప్తివల్ల సాధారణ ప్రజలకు ముప్పు తక్కువగానే ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ మరోమారు పునరుద్ఘాటించారు. టెఫరీన్ నుంచి మాడ్రిడ్‌కు 14 మంది స్పెయిన్ జాతీయులను తరలిస్తున్న విమానం ఆదివారం బయలుదేరింది. అక్కడి నుంచి వారిని సైనిక ఆసుపత్రికి తరలించి క్వారంటైన్‌లో ఉంచనున్నట్లు స్పెయిన్ అధికారులు తెలిపారు. అన్ని దేశాల ప్రయాణికుల తరలింపు పూర్తయ్యాక హంటా వైరస్ బారినపడి మరణించిన ఒకరి మృతదేహం నౌకలోనే ఉంటుందని వెల్లడించారు. నౌక నెదర్లాండ్స్‌లోని రోటర్‌డ్యాంకు ప్రయాణిస్తుందని, అక్కడ దానికి క్రిమి సంహారక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్స్, ఐర్లాండ్, తుర్కియే, గ్రీస్, జర్మనీ, బెల్జియం, అర్జెంటీనా దేశాలు నౌకలోని తమ పౌరులను తరలించేందుకు విమానాలు పంపనున్నాయి. నౌకలోని అమెరికా పౌరులను నెబ్రాస్కాలోని వైద్య కేంద్రంలో క్వారంటైన్ చేయనున్నారు.

## 'మునీర్ ప్రకటనలన్నీ డొల్లే".. ఇలా బహిర్గతం



ఆపరేషన్ సిందూర్ వేళ అమెరికా సాయం కోసం పాకిస్థాన్ లాబీయింగ్ యత్నాలు బహిర్గతమయ్యాయి. ఈ విషయం యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన ఫైలింగ్స్‌లో వెల్లడైంది. రక్షణ, ఆర్థికశాఖ అధికారులు, జర్నలిస్టులతో పాక్ లాబీ సంస్థలు 60 సార్లకు పైగా భేటీ అయినట్లు పేర్కొంది. కాల్పుల విరమణ కోసం అమెరికా ద్వారా భారత్ ప్రయత్నాలు చేసిందని, ప్రాంతీయ శాంతి కోసం పాక్ ఆ అభ్యర్థనలను అంగీకరించిందని ఆదివారం రావల్పిండిలోని ఆర్మీ జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆసిమ్ మునీర్ ( అవి డొల్లే అని తాజాగా తేలిపోయింది.

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ ఆపరేషన్ సిందూర్ ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఉగ్రస్థావరాలను మన సైన్యం నేలమట్టం చేసింది. ఆ సమయంలో వాషింగ్టన్‌లోని కీలక నేతలు, అధికారులతో పాక్ హడావుడిగా చర్చలు జరిపింది. మే 6 అర్ధరాత్రి భారత్ దాడుల ధాటికి కంగుతిన్న పాక్ 30సార్లు వేర్వేరుగా సంప్రదింపులు చేపట్టింది. పాక్ అంబాసిడర్‌కు అమెరికా నేతలతో సమావేశాల కోసం ప్రయత్నాలు చేసింది. ఇక మే 7, 8న తమ ప్రాంతంలో ఉద్రిక్తతలపై చర్చించేందుకు లాబీయింగ్ చేసిందని రికార్డులు వెల్లడించాయి. మే 9న లాబీయింగ్‌ను మరింత పెంచింది. రక్షణ, జాతీయ భద్రతకు చెందిన వ్యక్తులతో 20 నుంచి 25 సార్లు సంప్రదింపులు చేపట్టింది. అమెరికా మీడియాలోని ప్రముఖ జర్నలిస్టులతోనూ పాక్ లాబీ సంస్థలు భేటీ అయ్యాయి. వాషింగ్టన్‌లో భారత్, పాకిస్థాన్ కార్యకలాపాలకు పూర్తి వ్యత్యాసం కనిపించిందని ఆ ఫైలింగ్స్ ద్వారా వెల్లడవుతోంది. ఉగ్రవాదాన్ని ఖండించడం పైనా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా దౌత్యపరమైన మద్దతు కూడగట్టడం పైనా భారత్ సంప్రదింపులు చేపట్టింది. ఇదిలాఉంటే.. పాకిస్థాన్ (ఘుఎఅర్ఘుఅ)తో ఉద్రిక్తతల విషయంలో భారత్ తొలి నుంచి మూడో పక్షం జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కంగుతిన్న పాక్ చివరకు కాళ్లబేరానికి రావడంతో మన ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే.

# అమల్లోకి వచ్చిన భారత్, యూకే వాణిజ్య ఒప్పందం

భారత్–యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందంతో యూకే మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు మరింత సులభంగా ప్రవేశం లభించనుండగా, ముఖ్యంగా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), కార్మికులు, స్టార్టప్‌లు, తయారీ రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. యూకేకు వెళ్లే భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు పన్ను రహిత ప్రవేశం లభించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఫార్మా, రసాయనాల వంటి రంగాలు ఎక్కువగా లాభపడే అవకాశం ఉ ందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఒప్పందం భారత ఎగుమతులను పెంచడంతో పాటు దేశీయ తయారీ, ఉపాధికి కూడా ఊతమివ్వనుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని 'చారిత్రాత్మక మైలురాయి'గా అభివర్ణించారు. ఈ ఒప్పందం వికసిత భారత్–2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా రైతులు, కార్మికులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. వస్తువులతో పాటు ఐటీ, కన్సల్టింగ్, ఆరోగ్య, విద్య వంటి సేవల రంగానికీ ఈ ఒప్పందం ప్రయోజనం చేకూరనుంది. అలాగే రెండు దేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యం మరింత పెరుగుతాయని అంచనా. పరిశ్రమ వర్గాల ప్రకారం, ఈ ఒప్పందం ప్రభావంతో 2030 నాటికి భారత్–యూకే ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు 120 బిలియన్ డాలర్ల(రూ. 11.54 లక్షల కోట్ల)కు చేరే అవకాశం ఉంది. దీంతో అభివృద్ధి చెందిన మార్కెట్లలో భారత వ్యాపారాలకు మరింత బలమైన స్థానం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ ఒప్పందంతో యూకే మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు మరింత సులభంగా ప్రవేశం లభించనుండగా, ముఖ్యంగా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), కార్మికులు, స్టార్టప్‌లు, తయారీ రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. యూకేకు వెళ్లే భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు పన్ను రహిత ప్రవేశం లభించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఫార్మా, రసాయనాల వంటి రంగాలు ఎక్కువగా లాభపడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



## కేంద్రం కీలక నిర్ణయం.. ఇంధన ఎగుమతులపై రూ. 7 పెంపు




అమెరికా, ఇరాన్ యుద్ధ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రభావంతో ముడి చమురు (గ్లోబల్ క్రూడాయిల్) ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ చమురు కంపెనీల ఎగుమతులపై నియంత్రణ విధించేందుకు గానూ డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై విధించే అదనపు పన్నును ఏకంగా రూ. 7 మేర పెంచింది. దీనితో ఇప్పటివరకు లీటర్‌పై రూ. 8.5 గా ఉన్న పన్ను ఒక్కసారిగా రూ. 15.5 కి చేరింది. అయితే, పెట్రోల్ ఎగుమతులపై విధిస్తున్న పన్నును మాత్రం లీటర్‌కు రూ. 4 నుంచి రూ. 2.5 కి తగ్గిస్తూ సామాన్యులకు కొంత ఊరటనిచ్చింది. ఈ సవరించిన కొత్త రేట్లు నేటి నుంచే అమల్లోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో, దేశీయ రిఫైనరీలు స్థానిక మార్కెట్లను వదిలి విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా భారీ లాభాలు గడించకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై పన్నులు పెంచినప్పటికీ, దేశీయంగా ఇంధన లభ్యతను పెంచడమే దీని ప్రధాన ఉద్దేశం.

## పెట్రోల్–డీజిల్, ఏటీఎఫ్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం.....




మధ్యప్రాచ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును భారీగా పెంచింది. పెరుగుతున్న అంతర్జాతీయ చమురు ధరల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం, డీజిల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.8.50 నుంచి రూ.15.50కు పెంచారు. అలాగే, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.7.50 నుంచి రూ.14.50కు పెంచారు. ఈ కొత్త పన్ను రేట్లు జూలై 16 నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే, పెట్రోల్ ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును లీటరుకు రూ.4 మేర తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విండ్‌ఫాల్ ట్యాక్స్ అనేది ప్రభుత్వం చమురు కంపెనీలపై లేదా ఎగుమతిదారులపై విధించే అదనపు పన్ను. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగినప్పుడు కంపెనీలకు అధిక లాభాలు వస్తాయి. అలాంటి పరిస్థితుల్లో దేశీయ మార్కెట్‌లో ఇంధన లభ్యతను కాపాడడం, అధిక లాభాలను నియంత్రించడం కోసం ప్రభుత్వం ఈ పన్నును విధిస్తుంది. ఇటీవల అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గిన సమయంలో ప్రభుత్వం డీజిల్ పై విండ్‌ఫాల్ పన్నును తగ్గించి, పెట్రోల్‌పై పెంచింది. అయితే ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడంతో డీజిల్, యఈపై పన్నును మరోసారి పెంచింది. డీజిల్, యఈపై విండ్‌ఫాల్ పన్ను పెరిగిందంటే దేశీయ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే పెరుగుతాయని భావించాల్సిన అవసరం లేదు. ఈ పన్ను ప్రధానంగా ఎగుమతులపై మాత్రమే వర్తిస్తుంది. కాబట్టి ఈ నిర్ణయం వల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రత్యక్ష ప్రభావం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి.


ఈ పరిస్థితుల్లో దేశీయ ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చూడడంతో పాటు, ఎగుమతుల ద్వారా చమురు కంపెనీలు అధిక లాభాలు పొందకుండా నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం విండ్‌ఫాల్ పన్నులో మార్పులు చేసింది.

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు...



దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాతో ఫెడరల్ రిజర్వు దూకుడుతో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని పెంచింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 130.49 పాయింట్లు లాభపడి 77,185.43 వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 26.45 పాయింట్లు అందుకొని 24,078.50 వద్ద ముగిసింది.

## యూనికార్న్ జాబితాలోకి ఎమర్జెంట్‌తాజాగా
### సి' విడతలో రూ.1,240 కోట్ల సమీకరణ




కృత్రిమమేధ (ఏఐ) సాఫ్ట్‌వేర్ క్రియేషన్ ప్లాట్‌ఫామ్ అయిన ఎమర్జెంట్ 130 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,240 కోట్ల) నిధులను తాజాగా సమీకరించింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ క్రియేగిస్ నేతృత్వంలో జరిగిన తాజా ఫండింగ్ వల్ల.. ఏడాదిలోనే ఈ అంకుర సంస్థ విలువ 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14,250 కోట్ల)కు చేరింది. ఫలితంగా యూనికార్న్ (కనీసం 100 కోట్ల డాలర్లు/రూ.9500 కోట్లు అంతకంటే అధిక విలువ కలిగిన సంస్థ)గా అవతరించింది. ఎమర్జెంట్ ప్రధాన కార్యాలయం శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా 200 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 95% మంది భారత్‌లోనే పని చేస్తున్నారు. తాజా నిధులతో కలిపి ఎమర్జెంట్ సమీకరించిన మొత్తం మూలధనం 230 మి.డాలర్ల (సుమారు రూ. 2,200 కోట్ల)కు చేరింది. 'సి' విడతలో ఎంఎన్ఐ వెంచర్స్ –క్లేపాండ్ క్యాపిటల్, సెంటినల్ గ్లోబల్ సంస్థలు సహ ప్రధాన పెట్టుబడిదార్లుగా వ్యవహరించగా, ఖోస్లా వెంచర్స్, సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ 2, లైట్‌స్పీడ్, వై కాంబినేటర్ వంటి సంస్థలు కూడా పాల్గొన్నాయి. ఈ నిధుల సేకరణతో కేవలం 4 నెలల్లోనే ఎమర్జెంట్ విలువ 5 రెట్లు పెరిగింది. జనవరిలో జరిగిన సిరీస్ 'బి' రౌండ్ నిధుల సమీకరణకు సంస్థ విలువను 300 మి.డాలర్లు (సుమారు రూ. 2850 కోట్లు)గా పరిగణించారు. అప్పుడీ అంకురం 70 మి.డాలర్ల (సుమారు రూ. 665 కోట్లు) ను సమీకరించింది.


# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఎల్పీజీ సిలిండర్లు

దేశీయంగా క్విక్ కామర్స్ సేవలు మరో కీలక దశలోకి అడుగుపెట్టాయి. ప్రభుత్వ రంగ మహారత్న సంస్థ హెచ్‌పీసీఎల్‌తో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ భాగస్వామ్యం కుదుర్చుకుని, దేశంలోనే తొలిసారిగా ఆన్–డిమాండ్ ఎల్‌పీజీ సిలిండర్ డెలివరీ సేవలను బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించింది. నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ సేవల ద్వారా వినియోగదారులు ఇన్‌స్టామార్ట్ యాప్‌లోనే హెచ్‌పీసీఎల్ కొత్త 10 కేజీల 'హెచ్‌పీ నవ్య' కాంపోజిట్ సిలిండర్‌తో పాటు 5 కేజీల మెటల్ సిలిండర్‌ను కూడా ఆర్డర్ చేసుకోవచ్చు. ముఖ్యంగా, అపార్ట్‌మెంట్‌లలో నివశించే చిన్న కుటుంబాలు, ఉద్యోగస్థులు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీన్ని తీసుకొచ్చారు. తేలికగా, తుప్పు పట్టకుండా ఉండే 'హెచ్‌పీ నవ్య' సిలిండర్‌లో ట్రాన్స్‌పరెంట్ బాడీ ఉండటంతో గ్యాస్ నిల్వను సులభంగా తెలుసుకోవచ్చు.

గ్యాస్ కనెక్షన్ లేకపోయినా మొదటిసారి కొత్త సిలిండర్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉండగా, తర్వాతి ఆర్డర్లు రీఫిల్‌గా పరిగణించి ఖాళీ సిలిండర్‌ను తీసుకుని కొత్తది అందజేస్తారు. అన్ని డెలివరీలను హెచ్‌పీసీఎల్ అధీకృత డీలర్లు, శిక్షణ పొందిన సిబ్బంది భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తారు. ఈ భాగస్వామ్యంతో కిరాణా వస్తువులకే పరిమితమైన క్విక్ కామర్స్ ఇప్పుడు గృహ అవసరాల వంటి కీలక యుటిలిటీ సేవల్లోకి కూడా విస్తరిస్తోందని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా పేర్కొన్నారు.





## ఐబీఎం చరిత్రలోనే అతిపెద్ద పతనం.....




గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం వాల్ స్ట్రీట్ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పతనాన్ని చవిచూసింది. ఒక్క రోజులో కంపెనీ షేర్ ధర దాదాపు 25 శాతం క్షీణించడంతో కొన్ని గంటల వ్యవధిలో కంపెనీ మార్కెట్ విలువ దాదాపు 70 బిలియన్ డాలర్ల (మన కరెన్సీలో రూ.6.74లక్షల కోట్ల)కు పైగా సంపద ఆవిరైంది. గత 58 ఏళ్లలోనే ఐబీఎం కంపెనీ షేరు విలువ ఒక్క రోజులో ఇంత దారుణంగా పతనం కావడం ఇదే తొలిసారి. త్రైమాసికంలో తమ వ్యాపార అంచనాలు తప్పాయని కంపెనీ అంగీకరించడంతో.. మంగళవారం నాడు ఐబీఎం షేర్లు పడిపోయాయి. ఇది 1987 నాటి చారిత్రాత్మక గ్లోబల్ మార్కెట్ క్రాష్ (బ్లాక్ మండే) కంటే పెద్ద పతనం కావడం గమనార్హం. ఈ స్థాయి నష్టాలకు ప్రధాన కారణం త్రైమాసిక ఫలితాలఓ పాటు కంపెనీ సీఈఓ వ్యాఖ్యలు కూడా ప్రభావితం చేశాయి.

## ఎక్కడ పడితే అక్కడ కెమెరాలతో నా వెంటపడకండి..



సినీ సెలబ్రిటీలు ఎక్కడ పడితే అక్కడ, ఏ సమయంలో కనిపిస్తే ఆ సమయంలో కెమెరాలు పట్టుకుని ఫొటోలు తీస్తూ, వాటిని సోషల్ మీడియాలో పెట్టడం ఈ మధ్య బాగా ట్రెండ్ అయింది. ఎయిర్‌పోర్ట్, హోటల్స్, జిమ్, చివరకు వాళ్ల పర్సనల్ పనుల కోసం బయటకు వచ్చినా వదలకుండా ఫొటోగ్రాఫర్లు వెంటపడుతున్నారు. వారికి వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా ప్రవర్తిస్తూ.. ఇబ్బంది పెడుతున్నారు. అయితే కొందరు హీరోయిన్ల వెనకాల నుంచి బాడీ పార్ట్స్ చూపిస్తూ వీడియోలు తీయడం వంటివి చేస్తున్నారు. అయితే ఈ విషయంపై ఎంతోమంది తమ ఆవేదన వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా ఇలాంటి సంఘటనే బాలీవుడ్ హాట్ బ్యూటీ మౌనీ రాయ్‌కు ఎదురైంది. దీంతో ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కారు ఎక్కి వెళ్తున్నా సరే కెమెరాలతో రికార్డ్ చేయడానికి ప్రయత్నించడంతో, విసిగిపోయి ఫొటోలు తీయడం ఆపేయమని గట్టిగా చెప్పారు. మౌనీ రాయ్ ఇటీవల ముంబైలో మీడియా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది.

ఈ వీడియో నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. ఇక ఈ గొడవపై మౌనీ రాయ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో సంచలన పోస్ట్ పెట్టారు. ఆ తర్వాత దాన్ని డిలీట్ చేశారు. తన ఫొటోలు తీయమని తాను ఎప్పుడూ మీడియా వాళ్లను పిలవలేదని, ఇకపై కూడా తనను ఫాలో అవ్వద్దని ఆమె స్పష్టం చేశారు. మీడియా వాళ్లపై తనకు గౌరవం ఉందని, కానీ తన పర్సనల్ స్పేస్‌ను గౌరవించి తన జోలికి రావద్దని కోరారు. ఇక ముందెప్పుడైనా తాను కెమెరాలకు చిక్కినా.. అది తాను పిలిస్తే వచ్చింది కాదని జనాలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ కెమెరా హడావిడి తనకు అస్సలు నచ్చడం లేదని, దయచేసి ఇక్కడితో ఆపేయాలంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.


# వరుస ఆఫర్స్‌తో బిజీ బిజీగా ప్రీతీ ముకుందన్..



ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఇందులో నటుడు అర్జున్‌కు కుమార్తెగా కనిపించిన యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్.. యాక్షన్ సీన్లలో అదరగొట్టి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అంతే కాకుండా.. తాజాగా వచ్చిన 'హృదయం మురళి'తో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న ఈ అమ్మడు..

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. అంతే కాకుండా.. టైమ్ షెడ్యూల్ సెట్ అవ్వకపోవడంతో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రంలో వచ్చిన ఆఫర్‌ను సైతం రిజెక్ట్ చేసింది. ఇలా బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్‌తో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయిన ప్రీతి ముకుందన్ తాజాగా మరో స్టార్ హీరో సినిమాలో చాన్స్ అందుకున్నట్లు టాక్. ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో 'ఓం', వెట్రిమార్ దర్శకత్వంలో 'తమిళ మురుగన్' ప్రాజెక్టులతో బిజీగా ఉన్న తమిళ స్టార్ హీరో ధనుష్.. తన ఆ56 కోసం కూడా సిద్ధం అవుతున్నాడు. దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీని ప్రీతి ముకుందన్‌ను ఫిక్స్ చేశారట మేకర్స్. ఇప్పటికే కథ చర్చలు కూడా జరిగిపోగా.. దాదాపు ఫైనల్ అయినట్లు తెలుస్తుండగా త్వరలో దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉంది.

## శ్రీలీల నిర్ణయం చూసి ఆశ్చర్యపోతున్న అభిమానులు....



సినిమా ఇండస్ట్రీలో ఒక స్థాయికి చేరుకున్న తర్వాత ఏ సినిమా చేయాలనే దానికంటే, ఏ సినిమాను వదులుకోవాలనే నిర్ణయం కూడా చాలా కీలకమని సినీ విశ్లేషకులు తరచూ చెబుతుంటారు. సరైన నిర్ణయాలు తీసుకున్న హీరోయిన్లే ఎక్కువ కాలం స్టార్‌డమ్‌ను కొనసాగించగలరని వారి అభిప్రాయం. ఈ నేపథ్యంలో శ్రీలీల తీసుకున్న కొన్ని నిర్ణయాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు పలు చిత్రాల్లో నటించిన శ్రీలీలకు భారీ విజయాలు తక్కువే అయినప్పటికీ, ఆమెకు ఉన్న క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

కొంతకాలం క్రితం అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' చిత్రంలో మొదట శ్రీలీలనే హీరోయిన్‌గా ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదలైంది. అయితే డేట్స్ సర్దుబాటు చేయలేక ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. అనంతరం భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా ఎంపికైంది. ఇటీవల విడుదలైన 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో, శ్రీలీల ఆ సినిమాను వదులుకోవడం పెద్ద తప్పిదమని సోషల్ మీడియాలో పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ సినిమా చేసి ఉంటే ఆమె ఖాతాలో మరో భారీ విజయం చేరేదని అభిమానులు భావిస్తున్నారు. ఇదే సమయంలో శ్రీలీల మరో అవకాశాన్ని కూడా వదులుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ కుమార్ హీరోగా రూపొందుతున్న ఓ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా తీసుకోవాలని భావించారని, అయితే డేట్స్ సమస్య కారణంగా ఆ ప్రాజెక్ట్‌ను కూడా వదులుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆమె స్థానంలో కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో మరోసారి శ్రీలీల నిర్ణయాలపై అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఏదేమైనా హిట్లు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా శ్రీలీల తన క్రేజ్‌ను మాత్రం అలాగే కొనసాగిస్తోంది.


## నా క్యారెక్టర్‌లో అనేక లేయర్స్ ఉంటాయి...



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తుండగా.. తాజాగా ఈ సినిమా గ్రాండ్ ప్రెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ.. 'మా మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేసి ఏడాది అవుతోంది.

ఇప్పటివరకు కూడా మీరు ఆ గ్లింప్స్ ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. అప్పటి నుంచి మీరు మాకు సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. మరో వారం రోజుల్లో మా సినిమా రిలీజ్ కు వస్తోంది. ఇప్పుడు మీ సపోర్ట్ ఇంకా అవసరం. సినిమా మొత్తం హార్డ్ హిట్టింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాలో వదలనే సాంగ్ లీడ్ సీన్ చాలా బాగుంటుంది. అలాగే సెకండాఫ్‌లో కొన్ని సీన్స్ మెమొరబుల్‌గా ఉంటాయి. ఈ చిత్రంలో నా క్యారెక్టర్‌లో అనేక లేయర్స్ ఉంటాయి. హీరోకు సమానంగా డైరెక్టర్ నా పాత్రను చిత్రీకరించారు. మీరు ఇప్పటిదాకా రిలీజ్ చేసిన నాలుగు పాటలు చూస్తే నాలుగు పాటల్లో ఒక్కోలా కనిపిస్తాను. అన్నీ వేరేషన్స్ నా పాత్రలో ఉంటాయి' అంటూ చెప్పుకొచ్చింది

## అందర్నీ మెప్పించే'రాజా ది రాజా'



రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన సినిమా 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. బృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారిక దాసరి నిర్మించిన ఈ చిత్రాన్ని కె. శ్రీలత రెడ్డి సమర్పి స్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రి బ్యూటర్స్ ద్వారా ఈనెల 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో రుత్విక్ మీడియాతో ముచ్చటించారు. నా తొలి సినిమా విడుదలకు రావడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. అలాగే కొంచెం టెన్షన్ కూడా ఉంది. ఈ రోజు కోసం ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్నాను. నా కల ఇప్పుడు నెరవేరబోతోంది. ప్రేక్ష కులు ఈ సినిమాను ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే ఆసక్తి, టెన్షన్ రెండూ ఉన్నాయి. తొలి సినిమాకే రెండు గెటప్స్ చేయడాన్ని చాలా ఛాలెంజింగ్ గా తీసుకున్నాను. ఇందులోని రెండు గెటప్స్ కోసం పూర్తిగా ప్రిపేర్ అయ్యాను. విక్రమ్, కమల్ హాసన్ చేసిన విభిన్న పాత్రలు నాకు చాలా ఇష్టం. వారి స్ఫూర్తితోనే నా క్యారెక్టర్ని బాగా చేయగలిగాను. నరేష్ నా తండ్రి పాత్రలో కనిపిస్తారు. సాయికుమార్ తో నటించడం కూడా గొప్ప అను భవం. డైరెక్టర్ అనిల్ బోయిడపు చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. చాలా మంచి డైరెక్టర్ అవుతారు.

తొలి సినిమాకే రెండు గెటప్స్ చేయడాన్ని చాలా ఛాలెంజింగ్ గా తీసుకున్నాను. ఇందులోని రెండు గెటప్స్ కోసం పూర్తిగా ప్రిపేర్ అయ్యాను.నేను చేసిన షార్ట్ చూసిన తరువాత మా కుటుంబానికి నాపై మరింత నమ్మకం వచ్చింది. ఆ నమ్మకంతోనే మా అమ్మ నిర్మాతగా ఈ సినిమాని నిర్మించారు. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయననే నమ్మకంతో ఉన్నాను.

## 'వదలా'హిట్ ఖాయం



చరిత చిత్ర బ్యానర్ మీద కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'వదలా'. జగపతి బాబు, లయ, హృతిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆకెళ్ల వి కృష్ణ తెరకెక్కించిన ఈ మూవీని ఈనెల 17న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ, 'ఈ చిత్రంతో నిర్మాతగా కిషోర్ కి మంచి విజయం దక్కాలి. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కాన్సెప్ట్, కథ చాలా కొత్తగా అనిపించింది. పాటలు నాకు చాలా నచ్చాయి. చోటా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. జగపతి బాబు అన్ని రకాల పాత్రల్ని, సినిమాల్ని చేశారు. ఆయన సెకండ్ ఇన్నింగ్స్ మాలాంటి అప్ కమింగ్ దర్శకులందరికీ వరం. 'ఇలాంటి థ్రిల్లర్ మూవీని చేయడం ఆనందంగా ఉంది. ఇదొక ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్. ఈ మూవీలో కంటెంట్ ఉంది అని నమ్మాను. ఈ చిత్రాన్ని వదలకుండా నాకోసం చూడండి. ఈ సినిమాకి ఇంకా బిజినెస్ కాలేదు. మా తమ్మారెడ్డి, కిషోర్ ధైర్యంతో ముందు అడుగు వేశారు. ఆడియెన్స్ సినిమా చూసి మాకు డబ్బులు ఇస్తారని ఆశిస్తున్నానుఅని జగపతి బాబు చెప్పారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, 'అవుట్ పుట్ చూశాక అద్భుతం అనిపించింది. నా ప్రొడక్షన్స్‌లో 'అంత:పురం' తర్వాత ఇదే బెస్ట్ ఫిల్మ్ అని తెలిపారు. 'తమ్మారెడ్డి వల్లే నేను నిర్మాతగా నిలబడగలిగాను. ఈనెల 17న మా సినిమాకి ప్రేక్షకులు వచ్చే వరకు నేను 'వదలా' (నవ్వుతూ). నేను సంకల్పంతో చేసిన ప్రతీ పని విజయం సాధించింది' అని నిర్మాత కిషోర్ నాయుడు చిరుమామిళ్ల చెప్పారు.

## అందుకే నేను డైరెక్టర్ అయ్యా...



చిత్రం, జయం, నువ్వు నేను, నేనే రాజు నేనే మంత్రి వంటి సినిమాలతో సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు దర్శకుడు తేజ. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ డైరెక్టర్.. సినిమా ఇండస్ట్రీలో కొందరు ప్రతిభ లేని దర్శకులతో పని చేయడం కారణంగానే నేను దర్శకుడిని అయ్యానంటూ షాకింగ్ కామెంట్స్ చేశాడు. 'కొందరు మహామహులతో పాటు.. కనీస ప్రతిభ.. పట్టుదల లేని కొందరు దర్శకుల వద్ద కూడా నాకు పనిచేశాను. సినిమా షూటింగ్ ప్రారంభమైన తర్వాత ఆ దర్శకులకు సినిమా నాణ్యతపై ఎలాంటి శ్రద్ధ ఉండేది కాదు.

ఏది పడితే అది తీసేసి ఎలాగోలా సినిమాను ముగించేద్దామనే ధోరణిలో వాళ్లు ఉండేవారు. సెట్స్‌లో దర్శకులకు ఉన్న ఆ నిర్లక్ష్యమే నన్ను డైరెక్టర్ కుర్చీ వైపు నడిపించింది. వాళ్లు సరిగ్గా చేయని, వదిలేసి వెళ్లిన కొన్ని సీన్స్‌కు నేను దర్శకత్వం వహించేవాడిని, అలా సినిమాల బాధ్యత అంతా నా భుజాలపై పడటం... ఆ తర్వాత ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడం నాకు ఆశ్చర్యం కలిగించేది.. అలా నేను దర్శకుడిని అయ్యాను' అంటూ చెప్పుకొచ్చాడు తేజ.

## 'ది ప్యారడైజ్'కు సూపర్ ఆఫర్ ఇచ్చిన దిల్‌రాజు..



ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఒకవైపు సినిమాలను నిర్మిస్తూనే, మరోవైపు భారీ చిత్రాల పంపిణీ హక్కులను సొంతం చేసుకుంటూ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేస్తున్నారు. దీంతో ఆయన తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజా సమాచారం ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఓ క్రేజీ సినిమా థియేట్రికల్ హక్కుల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా మరేదో కాదు.. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చేరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అందుకోసం షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా థియేట్రికల్ హక్కులను దక్కించుకునేందుకు దిల్ రాజు భారీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగా నిర్మాతలకు ఆకర్షణీయమైన ఆఫర్ కూడా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com